








భక్తులు


జీవిత చరిత్ర

బాల వీరులు








సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజీ
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస, అమ్మ శారదాదేవి
గురు వివేకానంద
గురు సాయి బాబా
గురు అరవిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళస్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

నన్ను "నేను" తెలుసుకోవటానికి

నన్ను "నేను" మార్చుకోవటానికి

"నేను" గా ఉండటానికి

మరియు అత్యుత్తమ జీవన విధానానికి

కావలసిన భక్తి,జ్ఞాన,కర్మ,ధర్మ సమాచారం ఒకేచోట తెలుగులో ఉచితంగా!

సాధారణంగా వేదాంతం తెలుసుకోవాలనే కోరిక వుంటుంది, కాని గ్రంధాలు అందుబాటులో లేవు. ఇంకొకరి దగ్గర గ్రంధాలు వుంటాయి, కాని జిజ్ఞాసువులకి ఎక్కడ ఉన్నవో తెలియదు. అలాగే కొన్ని లైబ్రరీ లో కొన్ని రకాల పుస్తకాలు మాత్రమే లభ్యం అవుతున్నాయి, అంతేగాక విలువైన గ్రంధాలు సరైన సంరక్షణ లేక కనుమరుగైపోతున్నాయి, కనుక మన అందరి కోసం భారత ప్రభుత్వం పురాతన ఆధ్యాత్మిక గ్రంధాలను సంరక్షించే నిమిత్తం ఎంతో శ్రమతో కంప్యూటరీకరణ ద్వారా ఒక చోట చేర్చుతూ ఆన్ లైన్ చేయటం జరిగింది. ఇటువంటి విలువైన జ్ఞాన సంపదను మరింత సులభంగా అందుబాటులోకి తీసుకురావటానికి సాయి రామ్ సేవక బృందం ఉడతా భక్తి గా ఇప్పటివరకి దాదాపు **5000** పుస్తకాలను వివిధ వర్గాలుగా విభజించి PDF(eBOOK) రూపంలో ఆన్ లైన్ లో ఉచితంగా అందించటం జరిగింది. కనుక ప్రతి ఒక్కరు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరు. ఇందుకు సహాయం అందించిన భారత ప్రభుత్వపు వెబ్ సైట్(డిజిటల్ లైబ్రరీ ఆఫ్ ఇండియా http://www.new.dli.ernet.in), ఆర్కైవ్ వెబ్ సైట్(https://archive.org), గూగుల్ వెబ్ సైట్(https://www.google.co.in), మైక్రోసాఫ్ట్ వెబ్ సైట్(http://www.microsoft.com) కు మేము ఋణపడివున్నాము.అలాగే ఇటువంటి బృహత్తర కార్యక్రమానికి పెద్ద మొత్తం లో గ్రంధాలను అందించిన తిరుమల తిరుపతి దేవస్థానమునకు కూడా మనం ఋణపడివున్నాము. సాయి రామ్ సేవక బృందం కోరుకొనేది ఒక్కటే, ప్రతి ఇల్లు ఆధ్యాత్మిక జ్ఞాన గ్రంధాలతో నిండిపోవాలన్నదే మా కోరిక.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) భారత ప్రభుత్వపు వెబ్ సైట్: http://www.new.dli.ernet.in లేక http://www.dli.ernet.in
2) సాయి రామ్ వెబ్ సైట్: http://www.sairealattitudemanagement.org
3) సాయి రామ్ గూగుల్ సైట్: https://sites.google.com/site/sairealattitudemanagement
4) ఆర్కైవ్ వెబ్ సైట్: https://archive.org/details/SaiRealAttitudeManagement

ఈ జ్ఞాన యజ్ఞం పై గల సలహాలు,సూచనలకు సేవక బృందాన్ని సంప్రదించుటకు: sairealattitudemgt@gmail.com

సాయి రామ్ భక్తి,జ్ఞాన సమాచారం: https://www.facebook.com/SaiRealAttitudeManagement

సాయి రామ్ భక్తి,జ్ఞాన సంబంద వీడియోలు: https://www.youtube.com/user/sairealattitudemgt

ఈ జ్ఞాన యజ్ఞంలో ప్రతి ఒక్కరు పాల్గొని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని,మీరు సంతృప్తులైతే మరొక సాధకునికి, జిజ్ఞాసువులకు మార్గం చూపించగలరని ఆశిస్తున్నాము. మీరు చదువుకోవటంలో ఏమైనా ఇబ్బంది కలిగితే సేవక బృందంను సంప్రదించగలరు. ఒకవేళ మా సేవలో ఏమైన పొరపాటు వస్తే మన్నించగలరు.

ఈ గ్రంధపు భారత ప్రభుత్వ డిజిటల్ లైబ్రరీ గుర్తింపు సంఖ్య: 2020050016398

Sai**R**eal**A**ttitude**M**anagement(SAI RAM) - సాయి నిజ వ్యక్తిత్వ నిర్వహణ(సాయి రామ్)

* సర్వం శ్రీ సాయినాథ పాద సమర్పణమస్తు *

భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

http://www.new.dli.ernet.in



అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, ఐవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

శ్రీరస్తు

బాలవీరులు

గ్రంథకర్త:

డి. సీతారామారావు.

ప్రకాశకులు:

కర్రా అచ్చయ్య అండ్ సన్సు

రాజమండ్రి.

1930

[వెల 0—7—6.

విషయసూచిక

చిత్రపటములు.

పీఠిక

తల్లిదండ్రులు తమ పుత్త్రుని వీరాగ్రేసరునిగను, ధర్మతత్పరునిగను, రాజభక్తునిగను జేయఁదలంచినచో దిగంతఖ్యాతి వహించిన మహనీయుల చరిత్రములఁ బఠింపఁజేయవలయును. గురువులు కూడఁ దమశిష్యుల హృదయ కేదారములయందు మహనీయుల సద్గుణ బీజములను నాటవలయును. అట్టి మహానుభావులు మనపురాణములయం దెందఱో పేర్కొనఁబడియున్నారు. "ఎప్పుడును సత్యమునే పలుకుము; ధర్మనిష్ఠుఁడవై యుండుము. పితృమాతృభక్తితత్పరుఁడవై మెలఁగుము. గురుని దైవముగాఁ జూడుము. ప్రభుభక్తిగలిగి విలసిల్లుము." అనియే తల్లిదండ్రులును, గురువులును, బాలురకు బోధింపవలయును. చదివిన, నాహ్లాదముగ నుండు పౌరాణికకథలు వారిచేఁ బఠింపింపవలయును. ఈయుద్దేశముతోడనే నే నీ "బాలవీరులు" అనుగ్రంథమును రచించితిని.

ఇందుఁ బేర్కొనఁబడినవారు — బాల్యమునందే తమ యసమానసద్గుణములచేతను, భక్తిచేతను, శౌర్యముచేతను, భువనవిఖ్యాతిఁ గాంచినవారు. చిన్నతనమునందే తనచిత్తమును

హరి యందు నిలిపి, జగత్తంతయు విష్ణుమయం బని తలంచి, హరిచింతనము మాను మని విష్ణుద్వేషి యగు తనతండ్రి యెంత చెప్పినను, శిక్షించినను, హింసించినను,వినక పిపీలికాదిబ్రహ్మ పర్యంతము సమస్త ప్రదేశములయందు హరియున్నాఁ డని ధిక్కరించి పలికి సభాస్తంభమునఁ దండ్రికి శ్రీహరిం జూపిన వాఁడు ప్రహ్లాదుఁడు. పినతల్లి యగుచురుచి యాడినదురుక్తులచే రోషమువహించి యరణ్యమున కేగి ఘోరమైన తపస్సు జేసి శ్రీమన్నారాయణునిఁ బ్రసన్నునిగాఁ జేసికొని, ధ్రువమైన పదవిఁ బొంది బ్రహ్మకల్పమువఱకుఁ దానును దనకీర్తియు నెగడునట్లు మహోదాత్తగుణంబులఁ బ్రకటించినవాఁడు ధ్రువుఁడు.

మహావీరాగ్రేసరుఁడై, యోధాగ్రగణ్యుల కభేద్య మగుపద్మవ్యూహము నొంటిమై ననాయాసముగ భేదించి, యసమసమరక్రీడచే విపక్షపక్షమునందలి యతిరథమహారథుల నెల్ల డిల్లపడఁ జేసి, సంగరరంగము నల్లకల్లోలము గావించి "తేజోనిధికి వయసు కారణ మగునే" యనునట్లు శైశవము నందె, యాచంద్రార్కతారావనీ శరధిస్థాయిగ నుండునట్లు యశ మార్జించి నిర్జరలోకమున కేగినవాఁడుసుభద్రాకుమారుం డగు నభిమన్యుఁడు. వాల్మీక్యాశ్రమమునఁ బూతచరిత్రయు,

జగన్మాతయు నగు సీతకు జనించి, సమస్తశస్త్రాస్త్రవిద్యల నభ్యసించి, తమకుఁ దండ్రి యగుట తెలియక, శ్రీరాముని క్రతుతురంగమును బట్టుకొని, భరతలక్ష్మణశత్రుఘ్నులకుఁ దమ శౌర్యముఁ బ్రకటించి, తుదకుఁ దండ్రియగు రామునిఁ గూడ నద్భుత మందఁ జేసినవారు కుశలవులు. వదాన్యులలో నగ్రగణ్యుఁడును వీరచూడామణియునగు కర్ణునకుఁ బుత్రుఁడై, యాతనిమరణానంతరమునఁ బాండవులయొద్దనుండి మహావీరుఁ డని పేరుగొన్నవాఁడు వృషకేతుఁడు.

ఈ బాలవీరశిఖామణుల చరిత్రము నొక్కొక్క బాలునకు నాదర్శములని నేను వేఱుగఁ జెప్ప నక్కఱ లేదు. కావున నీగ్రంథమును ప్రతిబాలుఁడును జదివి, యుత్తమజ్ఞానసంపన్నుఁడై వెలయుఁగాక!

రాజరాజేశ్వరీసదనము,
తెనాలి.
1—1—1928.

ఇట్లు,
దో. సీతారామారావు.

శ్రీరస్తు.

బాలవీరులు

1 ప్రహ్లాదుఁడు

మున్ను బ్రహ్మమానసపుత్రు లయినసనకసనందను లనుమునీంద్రులు శ్రీహరి దర్శించుటకు వైకుంఠమున కేఁగి హరిమందిరముఁ బ్రవేశింపఁబోయిరి. అప్పుడు మొగసాలనున్న జయవిజయు లనుమందిరపాలకు లామునీంద్రులను లోనికిఁ బ్రవేశింపనీక వారించిరి. అందులకుమునీంద్రులలిగి, యాజయవిజయులను రాక్షసులై పుట్టుఁ డని శపించిరి. శాపమునకు భయం బంది వారు తాపసోత్తముల పాదములపైఁ బడి వేఁడికొనఁగాఁ గ్రమ్మఱ సనకసనందనులు కరుణించి హరితో వైరంబు మూఁడుజన్మములకుఁ బాటించుచు నమ్మహాత్ముని సన్నిధానముఁ జేరఁగలుగుదు రని వచించిరి. ఆజయవిజయులే హిరణ్యకశిపుహిరణ్యాక్షులై భూతలంబున దితిగర్భమున జనించిరి. అందుఁ గనీయుం డైన హిరణ్యాక్షుఁడు వరాహరూపుం డగు హరిచే వధింపఁబడెను.

తమ్మునిచావు విని యగ్రజుండైన హిరణ్యకశిపుఁడు మిగుల విచారించి, తల్లిని మఱదండ్ర నోదార్చి, హరిపైఁ బగ సాధింపఁ దలంచి, మంత్రుల నెల్లర రావించి వారిఁ జూచి యిట్లు పలికెను. "మంత్రులారా! నాకుఁ దమ్ముఁడును మీకు హితుఁడునగు హిరణ్యాక్షుని శ్రీహరి సూకరవేషమునఁ జంపినాఁడఁట! ఈవార్త మీరువింటిరికదా! ఆశ్రీహరి యెచ్చట నున్నను సాధించి, వధించి వానిరక్తమున నాతమ్మునకుఁ దర్పణము సేయవలయును. ఈతఁడు మడిసెనేని, దేవతలందఱును మడిసినయట్లే. మీరు భూమితలం బెల్లఁ జరింపుఁడు. శ్రీహరిని వెదకుఁడు. మఖదీక్షితులఁ దపస్స్వాధ్యాయదానవ్రతస్థులఁ జంపుఁడు. శ్రీహరి యనఁగా నెక్కడనో యుండునని మీరు తలంపవలదు. అతఁడే యజ్ఞము. అతఁడే వేదము. సమస్త భూదేవక్రియలకు నాతఁడే మూలము. సకలధర్మములకు నాతఁడే యాధారము. ఎచ్చటగోవులు, భూసురులు, వేదములు, వర్ణాశ్రమధర్మములు నుండునో యచ్చట నాతఁడు తప్పక యుండును. కావున మీరా స్థలము లన్నియు ధ్వంసము సేయుఁడు."

ఇట్లు పలికి, యాదానవేంద్రుఁడు బ్రహ్మంగూర్చి తపస్సు చేసి, గొప్పవరములు వడసి వచ్చుటకు మందరాచలంబున కరిగెను. హిరణ్యకశిపుఁ డూర లేఁడుకదా యని దేవేం

ద్రుఁ డాతనిపురముపై దాడి వెడలివచ్చి, రాక్షసుల నెల్ల యుద్ధమునఁ బాఱఁదోలి, యంతఃపురముఁ బ్రవేశించి, హిరణ్యకశిపునిభార్యయగు లీలావతిని జెఱపట్టుకొనిపోవుచుండెను. అప్పుడామె పరిపూర్ణ గర్భవతియై యుండెను. తన్ను విడువు మని యామె మహేంద్రు ననేకవిధముల బ్రతిమాలుకొనెను. కాని, లాభము లేకపోయెను. ఇంద్రుం డట్లామెను గొనిపోవుచుండఁగా, నామెయార్తనాదము విని, నారదమునీంద్రుఁడు వచ్చి యింద్రునిఁ జూచి "అమరేంద్రా ! నీవు సమస్తధర్మముల నెఱింగినవాఁడవు. అట్టిచో సాధ్వి యగు నీమెను హరించుట ధర్మమా !" యని యడిగెను. ఆమాటల కింద్రుఁడు "మునీంద్రా ! నేను మఱియొకవిధ మయిన దుర్బుద్ధిఁ బూని యీమెను జెఱపట్టుకొని పోవుట లేదు. ఈమె భర్త యెట్టి జగద్ద్రోహియో నీ వెఱుంగుదువు. ఇప్పు డీమె గర్భవతియై యున్నది. ఈమెకుఁ బుట్టుపుత్రుఁ డెట్టిక్రూరకర్ముఁడై లోకముల బాధించునో ! కావున నే నీమెను గొనిపోయి, ప్రసూతిపర్యంత మీమెను రక్షించి, జనించిన కుమారుని వధించి, పిదప నీమెను విడిచిపుచ్చెద. ఇదియే నాతలంపు" అని బదులు చెప్పెను. అందులకు నారదుఁడు మహేంద్రునిఁ జూచి "అమరేంద్రా ! ఇదియా నీతలంపు. చాలుఁ జాలు. ఈమె గర్భమున నున్నకుమారుఁ డెవ్వరిచేతను జావఁడు.

ఆతఁడు పరమభాగవతోత్తముఁడు. ఆతనివలన సమస్త లోకములకును మేలు కలుగు" నని చెప్పి, యాలీలావతిని విడిపించి తన యాశ్రమమునకుఁ దీసికొనిపోయెను.

లీలావతికిఁ బరిచర్యలు సేయుటకై నారదుఁడు తాపసకన్యల నియమించెను. లీలావతియు మునీంద్రునియందు భక్తి గలిగి, యాతనికి శుశ్రూష గావించుచు, నాతనివలన సమస్త ధర్మముల నెఱుఁగుచుండెను. కాలక్రమమున నామె యొక శుభదినమున నొకకుమారునిఁ గాంచెను. ఆతఁడే ప్రహ్లాదుఁడు.

తపస్సు సేయుటకు మందరపర్వతమున కరిగిన హిరణ్యకశిపుఁడు పరమనిష్ఠఁబూని నిశ్చలమైన చిత్తముతో బ్రహ్మంగూర్చి ఘోరమైనతపము సేయఁదొడంగెను. ఆతని యతిదారుణమైన తపము సర్వలోకములకు నతిసంతాపకరంబై యుండెను. నిలింపులు దాని సైరింపఁ జాలక బ్రహ్మసన్నిధికిఁ బోయి యిట్లు విన్నవించిరి. "భారతీరమణా! దితికొడుకగు హిరణ్యకశిపుఁ డిప్పుడు మందరాచలంబున ఘోరమైన తపస్సుఁ జేయుచున్నాఁడు. తపోబలమున నీవు జగముల నెట్లు నిర్మాణము చేసి దేవతలలోఁ బెద్దవైతివో, యాతఁడు నట్లే తపోబలంబున మఱియొకభువనము నిర్మాణము సేయఁదలంచుటయే కాక తనకు నిత్యత్వము సంపాదింపఁ దలంచినాఁడు. కావున నాతనితపంబును వారించి భువనంబుల రక్షింపుము."

దేవతలపలుకులు విని, వారిని భయ మందవల దని చెప్పి పంపించి, యాచతుర్ముఖుఁడు హిరణ్యకశిపుఁడు తపము సేయుచున్న ప్రదేశమునకు వచ్చెను. హిరణ్యకశిపుఁడు నియమయుక్తుఁడై తపము సేయుచు, మేదోమాంసరక్తములు పిపీలికలచే హరింపఁబడుటంజేసి శల్యావశిష్టుఁడై యుండెను. బ్రహ్మ యాతనిం జూచి వెఱఁగుపడి, సమీపించి "ఓనిశాచరకులేంద్రా! నీవలె నిట్టియుగ్రమైనతప మింతకుముం దెవ్వరును జేయలేదు. ఇంక ముందుఁగూడఁ జేయరు. అన్నము జలము నొల్లక శరీరమున నిల్లెవ్వరు ప్రాణముల నిలుపఁగలరు? నీతపంబున కెంతయు మెచ్చితిని. నీకోరికలఁదీర్చెద. లెమ్ము." అని పలికి, యాతనిశరీరమునఁ దన కమండలుజలంబులు ప్రోక్షించెను. కమలాసనుని కమండలుజలములు మేనఁ బడినయంతనే, వజ్రసన్నిభదేహుఁడును, సువర్ణవర్ణుఁడును, మార్తాండతేజోవిరాజమానుఁడును నై, యాదానవేంద్రుఁడు తపము నుండి లేచి, చతుర్ముఖునిపదకమలములకు మ్రొక్కి యనేకవిధములఁ బ్రస్తుతించి, "దేవా! కోరినవారి కోర్కులఁ దీర్చి, రక్షించుట నీకే చెల్లును. నాకోర్కులు దీర్చెద నని యానతిచ్చి యుంటివి. నీవు నిశ్చయముగా నాయందు దయఁ బూని వరంబు లీయఁ దలంతువేని నాకోరినవి యొసంగుము.

శా. గాలిం గుంభిని నగ్ని నంబువుల నాకాశస్థలిన్ దిక్కులన్
నేలన్ ఘస్రములన్ దమఃప్రబలభూరిగ్రాహరక్షోమృగ
వ్యాళాదిత్యనరాదిజంతుకలహావ్యాప్తిన్ సమస్తాస్త్రశ
స్త్రాళిన్ మృత్యువు లేనిజీవనము లోకాధీశ యిప్పింపవే.

అదియునుం గాక రణమున నా కెదురు లేనిపరాక్రమ మును త్రిభువనవిజయమును గటాక్షింపుము." అనిపలికినం దానవేంద్రునితపమునకు సంతసించి యాతఁడుకోరినవరములన్నియు నిచ్చి "దైత్యేంద్రా! ఇట్టివరంబు లెవ్వరునుఁ గోరరు. కోరినను నోసంగను. నీవు నన్నుఁ దపంబున మెప్పించినకారణమున, దుర్లభము లయినయీవరముల నిచ్చితిని. బుద్ధిసంపన్నుఁడవై యుండు" మని పలికి యవ్విరించి నిజలోకమున కరిగెను.

ఇట్లు భారతీరమణునిచే వరంబుల నంది దానవేంద్రుఁడు నిజపురంబునకు వచ్చెను. ఆతఁడు లేనిసమయమున నింద్రుఁడు వచ్చుటయు, లీలావతిని జెఱఁగొని పోవుటయు, రాక్షసులచే నాతఁడు విని, తోఁకఁ ద్రొక్కినపామువలె మండి పడుచు, దేవతానగరిపై దాడివెడలఁ దలంచుచుండెను. అంతలో నారదుఁడు పుత్రసహితయైన లీలావతిని దోడ్కొని వచ్చి హిరణ్యకశిపున కప్పగించెను. హిరణ్యకశిపుఁడు మునీంద్రుఁడు తనయెడలఁ జూపిన యమూల్యకరుణ ననేకవిధములఁ బొగడి, నందనునిఁ జూచి యానందించెను.

తరువాత హిరణ్యకశిపుఁడు శ్రీహరిని సాధింపఁ దలంచి దిక్పాలుర నెల్లర సంగరంబున నోడించెను. దేవతలెల్లరు నాతనికి దాసులై వర్తించుచుండిరి. ఆదానవుఁడేసమయమున నెవ్వనిపై మరల దండెత్తివచ్చునోయని లోకపాలకులునిరంతరము భయము నందుచుండిరి. ఇంత యేల? సమస్తలోకములకును మనఃప్రాణములకును హిరణ్యకశిపుఁడే రాజై యుండెను. ఇవ్విధంబున నందఱం గెలిచి, యథేచ్ఛం జరించుచున్న దానవేంద్రుని కృత్యంబులకు భయం బంది, బృందారకు లెల్లరును శ్రీమన్నారాయణునిసన్నిధికిఁ జని నమస్కరించిముకుళితకరకమలులై దైత్యునివలనఁ దా మందుచున్న బాధల నెఱింగించి రక్షింపు మని కోరిరి. సురల దీనాలాపము లాలకించి భగవంతుం డగుశ్రీహరి వారిం గాంచి "అమరులారా! మీకు శుభం బగుఁగాక! దితిసుతునిక్రూరవ్యాపారం బంతయు వినుచుంటిమి. కాని,వానిని సాధించుటకు సమయముగాకపోవుటచే నూరకుంటిని.

"ఆ. శుద్ధసాధులందు సురలందు శ్రుతులందు
గోవులందు విప్రకోటియందు
ధర్మపదవియందుఁ దగిలి నాయందు వాఁ
డెన్నఁ డలుగు నాఁడె హింస నొందు".

ఇదియుంగాక తన కన్నకొడుకు ప్రహ్లాదుని వాఁడెన్నఁడు బన్నంబులం బెట్టునో, యపుడే యాదానవుఁడునశించును" అని పలికి వారివారి నెలవులకుఁ బంపివైచెను.

—♦ ప్రహ్లాదుని విద్యాభ్యాసము ♦—

"సీ. తనయందు నిఖిలభూతములందు నొకభంగి
సమహితత్వంబున జరగువాఁడు
పెద్దలఁ బొడఁగన్న భృత్యునికైవడిఁ
జేరి నమస్కృతుల్ సేయువాఁడు
కన్నుదోయికి నన్యకాంత లడ్డంబైన
మాతృభావన సేసి మరలువాఁడు
తల్లిదండ్రులభంగి ధర్మవత్సలతను
దీనులఁ గావఁ జింతించువాఁడు
సఖులయెడ సోదరస్థితి జరుపువాఁడు
దైవతములంచు గురువులఁ దలఁచువాఁడు
లీలలందును బొంకులు లేనివాఁడు
లలితమర్యాదుఁ డైనప్రహ్లాదుఁ డధిప."

"సీ. ఆకారజన్మవిద్యాదిపరిష్ఠుఁడై
గర్వసంస్తంభసంగతుఁడు గాఁడు
వివిధమహానేకవిషయసంపన్నుఁడై
పంచేంద్రియములచేఁ బట్టుపడఁడు

భవ్యవయోబలప్రాభవోపేతుఁడై
కామరోషాదులఁ గ్రందుకొనఁడు
కామినీప్రముఖభోగము లెన్ని కలిగిన
వ్యసనసంసక్తి నావంకఁ బోఁడు
విశ్వమందుఁ గన్నవిన్న యర్థములందు
వస్తుదృష్టిఁ జేసి వాంఛ యిడఁడు
ధరణినాథ దైత్యతనయుండు హరిపర
తంత్రుఁడై హతాన్యతంత్రుఁ డగుచు."

బాలుం డగు ప్రహ్లాదుఁడు దినదినప్రవర్ధమానచంద్రునిగతి నభివృద్ధిఁ గాంచుచుఁ దల్లిదండ్రులకుఁ దనముద్దుముచ్చటలచే ముదము గూర్చుచుండెను. సద్గుణము లన్నియు రూపము గైకొని యక్కుమారునియందుఁ జేరిన వని చెప్పవచ్చును. బాలుఁడైనను నాతని చిత్త మెప్పుడును హరియందు నిలిచియుండును. నీరు ద్రావునప్పుడైనను, భుజించునప్పు డయినను, నితరులతో మాటలాడునప్పు డైనను నాతఁడు హరినామచింతనము మఱచియుండఁడు. ఒక సమయమున శ్రీహరి తనతో సంభాషించినట్లు సంతోషించును. మఱియొక సమయమున హరిం బాడుచు గంతులు వైచును. ఒక్కసమయమునఁ దనలోఁ దానె మాటలాడుకొని నవ్వును. ఒక్కసమయమునఁ గేవలము వెఱ్ఱివానివలె లోక మంతయు మఱచియుండును.

తనకుమారుఁ డీవిధంబున నున్నాఁ డని విని హిరణ్యకశిపుం డాతని విద్యాసంపన్నునిఁగాఁ జేయఁదలచి యొక్కదినంబున వాని రావించి,

"క. చదువనివాఁ డజ్ఞుం డగు
జదివిన సదసద్వివేకచతురత గలుగుం
జదువఁగ వలయును జనులకు
జదివించెద నార్యులొద్దఁ జదువుము తండ్రీ!"

విద్య లేకపోవుటచేత నీవు కేవలము జడునివిధంబున నున్నాఁడవు." అని పలికి శుక్రాచార్యుని పుత్రులగు చండామార్కుల రావించి, కుమారుని వారికప్పగించి యాతనికివిద్య గఱపి నీతికుశలునిగాఁ జేయుఁడని చెప్పెను.

చండామార్కులు ప్రహ్లాదునిఁ దోడ్కొని పోయి, వాని కీడగు విద్యార్థులతోఁ జేర్చి, సమస్తశాస్త్రములు గరపిరి. అంతఁ గొన్నిదినంబు లేగినపిదప నొక్కనాఁడు తనకుమారుఁ డేమివిద్యఁ బఠించెనో యరయఁ దలచిఁ హిరణ్యకశిపుఁడు వానిని రావించి, ముద్దాడి తనతొడపైఁ గూర్చుండఁబెట్టుకొని "తనయా! నీకు గురువు లేమివిద్యఁ గఱపిరి? ఏయే శాస్త్రము లభ్యసించితివి? నీ కెయ్యది భద్రంబై యున్నది?" యని యడిగెను. అందులకుఁ బ్రహ్లాదుఁడు తండ్రికి నమస్కరించి,—

"ఉ. ఎల్లశరీరధారులకు నిల్లను-చీకటి నూతిలోపలం
దెళ్ళక మీరు మే మను మతిభ్రమణంబున భిన్నులై ప్రవ
ర్తిల్లక సర్వము న్నతని దివ్యకళామయ మంచు విష్ణునం
దుల్లముఁ జేర్చి తా రడవి నుండుట మేలు నిశాచరాగ్రణీ."

అని వచించెను. ప్రహ్లాదుని పలుకులు తండ్రి కాశ్చర్యముఁ గలిగించెను. ఆమాటను విని తండ్రి నవ్వుచుఁ గుమారునిఁ గాంచి "కుమారా ! ఎవ రెట్లు పలికిన శిశువు లట్లు పలుకుదురు. పరపక్షవాక్యంబు లాడు మని నీ కెవ్వరు బోధించిరి? నీబుద్ధి చూడ నాకుఁ గడుఁ జోద్య మగుచున్నది. పుత్రా! శ్రీహరి మనకు విరోధి ఆతని నీవు తలఁచెద వేల? నీవు నాకు బుత్రుఁడ వై సందులకు దేవతలను రణమున నిర్జింపవలయును. గంధర్వులఁ దోలవలయును. అంతయే కాని విష్ణువును స్మరింపరాదు." అని పలికెను.

తండ్రివాక్యములు విని పుత్రుఁడు తనగురువుల వీక్షించి యిట్లు పలికెను. "మూఢాత్ములు కొందఱు నేను మీరను భేదమును గల్పించుకొని పరమాత్మం డగుహరిని జూడజాలక యున్నారు. నిశ్చలజ్ఞానసంపన్ను లయినవారు గాని హరిం జూడఁజాలరు.

"తే. ఇను మయస్కాంతసన్నిధి నెట్లు భ్రాంత
మగు హృషీకేశుసన్నిధి నావిధముఁ

గరుఁగుచున్నది దైవయోగమునఁజేసి
బ్రాహ్మణోత్తమ! చిత్తంబు భ్రాంత మగుచు".

సీ. మందారమకరంద మాధుర్యమునఁ దేలు
మధుపంబు వోవునే మదనములకు
నిర్మలమందాకినీవీచికలఁ దూఁగు
రాయంచ సనునె తరంగిణులకు
లలితరసాలపల్లవఖాదియైచొక్కు
కోయిల సేరునే కుటజములకుఁ
బూర్ణేందుచంద్రికస్ఫురితచకోరక
మరుగునే సాంద్రనీహారములకు
నంబుజోదరదివ్యపాదారవింద
చింతనామృతపానవిశేషమత్త
చిత్త మేరీతి నిరతంబుఁ జేరనేర్చు
వినుతగుణశీల మాటలు వేయు నేల."

ఆమాటలకు గురులు కోపించి, యట్టిది కూడదని పలికి, మరల దానవేంద్రుఁ గాంచి "దైత్యేంద్రా! ఈబాలుని మరలఁ జదివించి నీతికుశలునిఁ జేసి తోడ్కొనివత్తు"మని పలికి యాప్రహ్లాదునిఁ దోడ్కొనిపోయి, మరలఁ గొన్ని శాస్త్రములు నేర్పి యొకనాఁడు హిరణ్యకశిపుసన్నిధికిఁదోడి తెచ్చిరి. ప్రహ్లాదుఁడు తండ్రికి నమస్కరించి నిలిచియుండెను.

దైత్యేంద్రుఁడు కుమారుని లాలించి "వత్సా! నీ వెప్పుడు సమస్తశాస్త్రములఁ జదివి నీతి పారగుఁడ వయ్యెదవో యని వేచియుంటిని. నీవు సమస్తశాస్త్రములఁ జదివితివా? నీవు చదివిన శాస్త్రములలో సార్థకంబైన యొకపద్యముఁ జెప్పి, దాని తాత్పర్యమును జెప్పు" మని పలికెను. ప్రహ్లాదుఁడు తండ్రిని విలోకించి వినయసూక్తుల నిట్లనెను.

తండ్రీ! నన్ను గురువులు సమశాస్త్రములు చదివించిరి. చదువులకేమి! అనేకము లున్నవి. అందలిమర్మము లన్నియు గ్రహించితిని. ముఖ్యమైనమర్మ మొక్కటి కలదు. వినుము.

"మ. తనువాఙ్మానసముల సఖ్యమునఁ శ్రవణమున్ దాసత్వమున్ వందనా
ర్చనముల్ సేవయునాత్మలో నెఱుకయున్ సంకీర్తనల్ చింతనం
బును నీతొమ్మిదిభక్తిమార్గముల సర్వాత్ముని హరి న్నమ్మి స
జ్జనుఁడై యుండుట భద్రమంచుఁ దలతున్ సత్యంబు దైత్యోత్తమా.

సీ. కమలాక్షు నర్చించు కరములు కరములు
శ్రీనాథు వర్ణించు జిహ్వ జిహ్వ
సురరక్షకునిఁ జూచు చూడ్కులు చూడ్కులు
శేషశాయికి మ్రొక్కు శిరము శిరము

విష్ణు నాకర్ణించు వీనులు వీనులు
మధువైరిఁ దవిలిన మనము మనము
భగవంతు వలగొను పదములు పదములు
"పురుషోత్తమునిమీఁది బుద్ధి బుద్ధి
దేవదేవునిఁ జింతించు దినము దినము
చక్రహస్తునిఁ బ్రకటించు చదువు చదువు
కుంభినీధవుఁ జెప్పెడి గురుఁడు గురుఁడు
తండ్రి హరిఁ జేరు మనియెడి తండ్రి తండ్రి.

సీ. కంజాక్షునకుఁ గాని కాయంబు కాయమే
పవనకుంభిత చర్మభస్త్రిగాక
వైకుంఠుఁ బొగడని వక్త్రంబు వక్త్రమే
ఢమఢమధ్వనితోడి ఢక్కగాక
హరిపూజనము లేని హస్తంబు హస్తమే
తరుశాఖనిర్మిత దర్వి గాక
కమలేశుఁ జూడని కన్నులు కన్నులే
తనుకుడ్యజాల రంధ్రములు గాక
చక్రిచింత లేని జన్మంబు జన్మమే
తరళసలిలబుద్బుదంబు గాక
విష్ణుభక్తి లేని విబుధుండు విబుధుఁడే
పాదయుగముతోడి పశువుగాక."

అని ప్రహ్లాదుఁడు పలుకుచున్న ప్రతివాక్యము శ్రీహరికి సంబంధించినదే. తనకాజన్మవిద్వేషి యగు శ్రీహరిం బుత్రుఁడు తలంచుట దానవేంద్రున కాగ్రహము గలిగించెను. కుమారునకు గురువులే యిట్లుబోధించి రేమో యని యాతఁడు వారిపై నాగ్రహించెను. చండమార్కులు హిరణ్యకశిపుని కోపముఁ జూచి భయంబంది "దైత్యేంద్రా! మే మిట్టిబుద్ధి గరపువారము కాము. ఇది యెవ్వరు నీతనికి బోధించినబుద్ధి కాదు. నీకృపకుఁ బాత్రులమైనమేము నీకుమారునకు విరోధిశాస్త్రములు బోధింతుమా" యని పలికిరి. అప్పుడు దానవేంద్రుడు కుమారుని విలోకించి "ఓరీ! గురువులు చెప్పని యీ బుద్ధి నీ కెవ్వరు చెప్పిరి? వారిం బేర్కొను" మని యడిగెను. అమ్మాటలకుఁ బ్రహ్లాదుఁ డిట్లు ప్రత్యుత్తర మిచ్చెను. "తండ్రీ! ఇట్టిబుద్ధి యెవ్వరు బోధించినను నలవడదు. వేయేల సర్వశాస్త్రములయందును శ్రీహరిసేవకు మించినది లే దని చెప్పఁబడియున్నది." హిరణ్యకశిపుఁడు కొడుకుమాటల కాగ్రహావేశ పరివశుండై తనప్రక్కనున్న దనుజభటులం గాంచి 'ఈ ప్రహ్లాదునిబుద్ధి మీరు కంటిరా! దైత్యకులాచారముల నీఁటు చేసి భీతియొక్కింతయు లేక శ్రీహరిని సేవించుచు నన్ను దిక్కరించి పలుకుచున్నాఁడు. ఇట్టివీనిని మీరాయిచ్చవచ్చినయట్లు శిక్షించి బుద్ధి దిప్పుఁడని పలికెను.

దైత్యేంద్రుని యాజ్ఞ ననుసరించి, యాభటులు ప్రహ్లాదునిఁ గొనిపోయి హరిసేవ విడువు మని యాతని ననేక విధముల శిక్షించిరి. తన్ను దానవు లెన్నిశిక్షలు సేయుచున్నను "శ్రీహరీ! రక్షింపుము." మనుమాటదప్ప మఱేదియుఁ బలుకకయుండెను. దానవు లాతని శూలముచేఁ బొడిచినను శరీరము కందలేదు. రుధిరము స్రవింపలేదు. అతఁడు భయమంది పాఱలేదు. రక్షింపుమని తల్లిని జేరలేదు, కుమారునియెడల దానవభటులు చేసినశిక్ష లన్నియు వ్యర్థములైనవని యూహించి యా హిరణ్యకశిపుఁడు ప్రహ్లాదుని నేనుగుల చేతఁ ద్రొక్కించెను. సర్పములచేఁ గఱపించెను. అగ్నిం ద్రోయించెను. చేయవలసిన ఘోరహింస లన్నియుఁ జేయించెను. ఏమియుఁ బ్రయోజనము లేకపోయెను. ఇన్నివిధముల బాధించినను గుమారుఁ డావంతయు నొవ్వక యుండుటకుఁ దండ్రి మిగుల నాశ్చర్య మందెను. ఆశ్చర్యమేకాదు. మహావిచారసాగరంబున మునింగెను. అట్టిసమయమునఁ జండామార్కు లాతనిం గాంచి "రజనీచరేంద్రా! నీవు విచారింపవలదు. చతుర్ధశభువనములను నీశాసనంబున నిలిపితివి అట్టిచో నీకుమారునిబుద్ధికి భయం బందెదవా! మే మీతనిఁ దీసికొనిపోయి గృహస్థుల కర్హము లయినధర్మముల నుపదేశించుచుందుము. ఇంతలో మాతండ్రి యగు శుక్రాచార్యులుగూడ

వచ్చు" నని పలికి, యాప్రహ్లాదునిఁ దోడ్కొనిపోయి,గృహస్థ ధర్మము లుపదేశింపఁ బ్రారంభించిరి.

ప్రహ్లాదుఁ డొక్కఁడే హరిభక్తుఁడగుట కాదు. గురువులు పాఠశాలయందు లేనిసమయమున నాతఁడు తోడిబాలకులకు హరిభక్తినుపదేశించి వారినిగూడ భక్తులుగాఁజేసెను. శిష్యులెల్లరును గురూపదిష్టశాస్త్రములు మంచివి కావని తలంచి, ప్రహ్లాదునిమార్గము ననుసరించిరి. పుస్తకంబుల నావలఁ బాఱవైచి హరిభజన సేయుచుండిరి. ఇఁక వారిని శిక్షించినందువలనఁ బ్రయోజనము లే దని తలంచి, యాచండామార్కులు హిరణ్యకశిపుం జేరి "దానవేంద్రా! నీకొడు కొక్కఁడే హరిభక్తుఁ డగుటగాక, తోడిబాలురకుఁ గూడఁ దనమార్గముపదేశించి యందఱ హరిభక్తులుగాఁ జేసినాఁడు. మేమెంత చెప్పినను నాతఁడు హరిభక్తిని వర్జింపఁడు. ఇఁక మేమాతనిని జదివింపలేము. నీవే యాతని మంచిమార్గమునఁ బెట్టుకొనవలయు" నని పలికిరి.

దేశికులమాటల నాలకించి ప్రళయకాలరుద్రునిక్రైవడి మండిపడుచు హిరణ్యకశిపుఁడు కుమారునిఁ దనకడకు రావించి యాతనింగాంచి, గంభీరరవంబున నిట్లనెను. "ఓరీ!కులద్రోహీ, నాయాజ్ఞ లేనిదే సూర్యుఁ డెండఁ గాయఁడు. గాలి వీవదు. అగ్ని వెలుఁగదు. శమనుఁడు ప్రాణులఁ జంపఁడు. సమస్తబ్రం

చారకులును నాకు వెఱచుచుందురు. అట్టిచో నీ వెట్లు నా యాజ్ఞ నుల్లంఘించుటకు సాహసించితివి. వైకుంఠుఁడు జగద్రక్షకుం డని యొత్తి చెప్పుచుంటివి. నే నమరులనుదండించునప్పు డాతఁ డేల వారి కడ్డుపడ రాకయుండెను? హరిని సేవించుచు దైత్యవంశాచారము మంటఁ గల్పుచున్న కులద్రోహి వగు నిన్ను ఖండించెదను. హరి నీకెట్లు లడ్డుపడునో చూచెద. నేను సప్తదిక్కులు గెలిచితిని. దేవతలందఱు నన్నే దిక్కని నమ్మి సేవించుచుందురు. లోకమునను న్న వీరులయం దెల్ల నేనే బలవంతుఁడను. నీ వెవ్వనిబలమును నమ్మి నాకుఁ బ్రతికూలవాక్యము లాడుచుంటివి? నీ కెవ్వరు దిక్కు."

ఇట్లు పలికిన తండ్రివాక్యములకుఁ బ్రహ్లాదుఁ డిట్లు ప్రత్యుత్తర మిచ్చెను.

"కం. బలయుతులకు దుర్బలులకు
బల మెవ్వఁడు నీకు నాకుఁ బ్రహ్మాదులకున్
బల మెవ్వఁడు ప్రాణులకును
బల మెవ్వం డట్టివిభుఁడు బల మసురేంద్రా."

"క. దిక్కులు కాలముతో నే
దిక్కున లేకుండఁ గలుగు దిక్కుల మొదలై
దిక్కుగలలేనివారికి
దిక్కెయ్యెడువాఁడు నాకు దిక్కు మహాత్మా."

తండ్రీ! నీవు సమస్తలోకముల జయించితివి. కాని నీకు శత్రువులైన యింద్రియంబుల జయింపలేకపోయితివి. ఇంద్రియనిగ్రహము చేసితివేని, నీకు లోకములో శత్రువులే యుండరు. కావున నట్టిది యొనర్చి చిత్తమును మాధవునియందు నిలుపుము."

ఇట్లు నిర్భయముగాఁ గుమారుఁడు పలికిన పలుకులకు నిశాటకులేంద్రుఁడు మఱింత కోపమును బూని, యతనింగాంచి "ఓరీ! చావునకుఁ దెగించి నాకు విరోధియైన హరింగూర్చి యనేకవిధంబుల వచించుచున్నావు. శ్రీహరిని జగన్నాథుఁడని వర్ణించుచుంటివి. నాతమ్మునిఁ జంపిన యాతనికొఱకనేక స్థలములు వెదకితిని. కాని వాఁడెక్కడను బొడగానరాఁడు వాఁడెక్కడ నేరూపమున నుండునో వానిజాడఁ గొంచెము తెలుపుము. నేను వానిఁ దున్మెద" నని పలికెను.

ప్రహ్లాదుఁడు తండ్రిమాటలకుఁ గొంచెమైనను శంకింపక, దరహాసితవదనారవిందంబున నిట్లు చెప్పెను.

"మ. కలఁడంభోధిఁ గలండు గాలిఁ గలఁ డాకాశంబునం గుంభినిం
గలఁ డగ్నిన్ దిశలం బగళ్ల నిశలన్ ఖద్యోతచంద్రాత్మలం
గలఁ డోంకారమునన్ ద్రిమూర్తులఁ ద్రిలింగవ్యక్తులం దంతటం
గలఁ డీశుండు గలండు తండ్రి వెదకంగా నేల నీ యా యెడన్"

"క. ఇందుఁ గలఁ డందు లేఁ డని
సందేహము వలదు చక్రి సర్వోపగతుం
డెందెందు వెదకిచూచిన
నందందే కలఁడు దానవాగ్రణి వింటే"

హిరణ్యకశిపునితోఁ బ్రహ్లాదుఁ డీవిధమునఁ జెప్పినవ వరమున భక్తసంరక్షణపరాయణుం డగు శ్రీమన్నారాయణుఁడు లోకముననన్ని ప్రదేశములయందును నరసింహరూపమున నుండెను. అప్పుడు దానవేంద్రుండు కుమారునిఁ దిలకించి "ఓరీ! డింభకా! శ్రీహరి సర్వస్థలములయందు నున్నాఁడని పలుకుచుంటివి. ఈసభాస్తంభమున నీ వాతనిఁ జూపెదవా! చూపలేకున్న ని న్నిప్పుడే ఖండించెద" ననెను. "బ్రహ్మ మొదలు తృణపర్యంతము నిండియుండు పరమాత్ముం డగు శ్రీహరి యీ స్తంభమున మాత్రి మేలయుండఁడు? నీ వాతని నీ స్తంభమునఁ దప్పక చూడఁగల" వని ప్రహ్లాదుఁడు మనంబున హరికి నమస్కరించి, తండ్రికి వచించెను. అంతట దానవేంద్రుఁడు సింహాసనమునుండి నేలకు లంఘించి ఖడ్గము ఝళిపించుచు "హరిం జూపు" మని పలుకుచు సభాస్తంభము నటి చేతిఖడ్గముతో వేసెను.

అంతట నిజభక్తుండైన ప్రహ్లాదునిమాట ధ్రువపఱచి, రక్షింపఁ దలఁచి, శ్రీహరి నరసింహరూపమున నా స్తంభము



అంతట.............................. ...వధించెను.

నుండి వెలువడి, యురగేంద్రుం డహిం బట్టుచందమున దానవేంద్రుఁ బట్టుకొని, కేవల నరరూపమునను, మృగరూపమును గాని నరసింహరూపమున, నాకాశమును భూమియుఁ గాని యూరుభాగమున, శస్త్రాస్త్రములు గానినఖంబుల వధించెను. హిరణ్యకశిపుని మృతికి సర్వదేవతలును సంతసించిరి. ఆసమయమున నచ్చటికి బ్రహ్మాదిదేవత లందఱును వచ్చిరి. కాని నరహరిరూపుఁ డగు లక్ష్మీకాంతునిమాత్ర మెవ్వరును భయముచేత సమీపింపఁజాలక యుండిరి. హిరణ్యకశిపుని వధించి, ప్రళయకాలరుద్రాకృతి నున్న యాహరిని శాంతునిఁ జేయుట యెట్లని యందఱును నాలోచించుచుండిరి తుద కీకార్యమున నాదేవతలచేఁ బ్రహ్లాదుఁడే నియోగింపఁబడెను.

ప్రహ్లాదుఁడు నెమ్మదిగా హరిని సమీపించి చేతులు జోడించి యిట్లు స్తుతించెను. "దేవా! చతుర్దశభువనాధీశ్వరుఁడవైన నిన్ను బ్రహ్మాదిదేవతలును, ఋషులును గూడ సమీపింప శక్తులు గారఁట. అట్టియెడ దానవడింభకుఁడ నైన నేను సమర్థుఁడ నగుదునా! నిన్ను సేవించుటకు ముఖ్యముగా నిర్మలజ్ఞాన ముండవలయును. క్రతువులు, తపములు, దానములును జేసితినని గర్వించుచు నీపదధ్యానము మానియున్న బ్రాహ్మణునికంటె, మనోవాక్కాయకర్మములయందు నిన్ను గొల్చుశ్వపచుఁడు శ్రేష్ఠుఁడు. మహాత్మా! అల్పుఁడ నగు

నేను నీతో సంభాషించుటకే భయం బందుచున్నాను. భవదీయ భయంకరస్వరూపంబును జూచి యందఱును భయం బందుచున్నారు. అసురమర్దనంబునకుఁ గదా నీవిట్టిరూపముఁ దాల్చితివి. అవతరించినపని తీఱెను. ఇంక నలుక మాని శాంతగుణము వహింపుము. తండ్రీ! దంష్ట్రివై నీవు మా పినతండ్రిని వధించుటచేత, నాతండ్రి నీయెడల ద్వేషభావము వహించి నీచేఁ జెగి కృతార్థుఁడైనాఁడు."

ప్రహ్లాదునిపలుకులు విని నరసింహదేవుఁడు శాంతభావముఁ దాలిచి, తనకరాంబుజముచే నతని శీర్షము నంటి "ప్రహ్లాదా! నీవు నాకు నిజమైనభక్తుఁడవు. నాయెడల వైరము సాధింపఁదలచి నీతండ్రి నిన్నెట్టికష్టములఁ బెట్టినను నోర్చి, నన్నె నమ్మిన వీరభక్తశిఖామణివి. నాచేఁగూలుటంజేసి నీతండ్రి సుగతికిఁ బోవును." అని వచించి యాతని కనేకవరము లిచ్చి బ్రహ్మాదిదేవతలఁ గూడి నిజలోకమున కేగెను.

2 ధ్రువుఁడు.

ఉత్తానపాదుండను నరపాలునకు సునీతియు సురుచియు నను నిరువురు భార్యలుండిరి. ఆనరపాలుఁడు ధర్మవ్రతాచార పరాయణుఁడును, సత్యసంధుఁడునై యుండినను, మోహమును మాత్రము జయింపలేకపోయెను. ఆతనికి సురుచియందధికాను రాగ ముండెను. సునీతియందు ధ్రువుఁడును, సురుచియందు నుత్తముఁడు ననుకొడుకు లాతనికి జనించిరి. ఆతఁడు సురుచియం దెక్కువ మోహము గలవాఁ డగుటచే నిరంతర మామెమందిరమందే యుండును. సునీతిని గంటనైనఁ జూడక యుండెను. ఇట్లుండ నొకనాఁ డుత్తానపాదుఁడు సురుచిమందిరమున నుత్తమునిఁ దనయంకమునఁ గూర్చుండఁ బెట్టుకొని, ముద్దులాడుచు సురుచితో నిష్టగోష్ఠిం బ్రొద్దుపుచ్చుచుండెను. ఆసమయమున నచ్చటికి సునీతిపుత్రుం డగు ధ్రువుఁడు వచ్చెను. అక్కుమారుఁడుగూడఁ దండ్రియంక మెక్కుట కుత్సాహ మంది, తండ్రిని సమీపించెను. ఉత్తానపాదుని ప్రక్క నున్న సురుచి ధ్రువుని యుత్సాహకారణ మెఱింగి యక్కుమారుని చేతిఁ బట్టుకొని "కుమారా! నీసంభ్రమకారణము నాకుఁ దెలియును. ఇట్టి యుత్సాహమువలనఁ బ్రయోజనము లేదు. నీవు తండ్రితోడ నెక్కుభాగ్యము నోఁచుకొని

యుంటివేని నాగర్భమునందే పుట్టియుందువు. ఇప్పుడైనను నీవట్టిభాగ్యము నందఁదలఁచితివేని శ్రీమన్నారాయణుని నాశ్రయింపు" మని పలికి వారించెను.

ఇట్లు పినతల్లియాడిన యసహ్యాకరములయిన వాక్యములాకుమారుని హృదయమునకు శరములవలెఁ దగిలెను. ఆమె యట్లు పలుకుచుండుటకుఁ దండ్రి సహించియుండుట యాతని చిత్తమును మఱింతదుఃఖమున ముంచివైచెను. బాలకుండైనను నాఁతఁ డాయవమానమును భరింపలేకపోయెను. దండతాడితమైన భుజగమువోలె రోషకలితుం డయ్యెను. కాని యేమి సేయఁగలఁడు? ఆతఁడు రోదనము సేయుచుఁ దల్లి యగు సునీతికడకుఁ బోయెను. కుమారునిదుఃఖకారణ మామె దాసీజనముచే విని, యాతని నంకమున గూర్చుండఁబెట్టుకొని, కన్నీరు దుడుచుచు "వత్సా! నీవు దుఃఖించినందువలనఁ బ్రయోజనము లేదు. సురుచి యాడినపలుకులు సత్యములే. నిర్భాగ్యురాలనగు నాగర్భమున జనించుటచే నీవట్టి పరాభవ మందితివి. పూర్వజన్మకర్మ మెవ్వరికైనను ననుభవింపక తప్పదు. భర్తచేత భార్యయని పిలిపించుకొనఁబడక యుండుటయే కాక కేవలము దాసికంటె నతినీచముగాఁ జూడఁబడుచున్ననాకుఁ గుమారుడవైతివి. ఇఁక నీవు దుఃఖింపవలదు. సురుచి వచించినయట్లు నీవు శ్రీమన్నారాయణునే యాశ్రయింపుము. నీదుఃఖమును

బ్రోవఁగలసమర్థుఁ డాతఁ డొక్కఁడే. ఆతఁడు సర్వలోకరక్షకుఁడు. భక్తపరతంత్రుఁడు. అర్థిజనమందారుఁడు. అమ్మహాత్ముని సేవించుచుండుటచేతనే బ్రహ్మ బ్రహ్మపదంబును బొందినాఁడు. మీతాతగూడ నాతనికృపకుఁ బాత్రుఁడై యనేకయాగములు చేసి సత్కీర్తినందెను. కావున నీ వాభక్తవత్సలునే చిత్తంబున నిలిపి సేవింపుము" అని పలికెను.

తల్లివాక్యములు విని, యాధ్రువుఁడు భగవంతుం డగు నారాయణునిఁగూర్చి తపము సేయఁదలంచి, పురము వెడలి చనుచుండెను. ఆతనికి మార్గమధ్యమున నారదుం డెదు రయ్యెను. నారదుఁ డాతని వృత్తాంతం బంతయు దివ్యదృష్టి నెఱింగి యతనిధైర్యంబున కచ్చెరువు నంది "బాలకా! నీవు పసివాఁడవు ఇట్టివయస్సున మానావమానములతో నీకు బనిలేదు. మందిరంబున నుండి సుఖంబుల ననుభవింపుము. నీ వేడ! భగవంతు డగు వారింగూర్చి తపము సేయుటేడ? పరమనిష్ఠాగరిష్ఠులై కాననంబులలో ఘోరతపం బొనర్చు యోగీశ్వరులే యమ్మహానుభావునిఁ బ్రసన్నుఁగాఁ జేసికొనఁజాలక యుందురు. సుఖదుఃఖములు దైవవశమునఁ గలుగుచుండును. సుఖమునకుఁ సంతోషింపక, దుఃఖమునకు వగవక యుండువాఁడే ధన్యుఁడు; వాఁడే విమలవిజ్ఞాని. కావున నీవు విచార మందక గృహమునకుఁ బొమ్ము" అని పలికెను. నారదునివాక్యము

లాతనిహృదయమునఁ బ్రవేశింపలేదు. ఆతఁడు శ్రీహరింగూర్చి తపము సేయవలయు ననియే దీక్ష వహించి గృహమునుండి బయలువెడలినవాఁ డగుటచే నారదుని విలోకించి, వినయభావము ప్రకటించుచు నిట్లు పలికెను. "ఓమునిచంద్రా! నాపినతల్లి యాడినదురుక్తులచే నేను నిర్భిన్నహృదయుఁడ నైతిని. నేను శ్రీమన్నారాయణునిగూర్చి ఘోరమైన తపం బొనర్చి త్రిభువనోత్కృష్టంబును ననన్యాధిష్ఠితంబును నగుపదంబు నందఁదలఁచితిని. ఇఁక నాచిత్తము తిరుగదు. దేవా! నీవు బ్రహ్మమానసపుత్రుఁడవు. మహామహిమాస్పదుఁడవు. నీకుఁ దెలియనివిషయములు లోకమున లేవు. కావున నాయందుఁ గృపాంతరంగుఁడవై శ్రీహరినిఁ బ్రసన్నునిగాఁ జేసికొనుటకుఁ దగిన మార్గము నాకుపదేశించి కృతార్థునిఁ జేయుము. నీకు నమస్కరించెద" అని యిట్లు పలికి యామునీంద్రుని పాదములపైఁ బడెను.

ధ్రువునిచిత్తము నిఁక నెవ్వరును ద్రిప్పఁజాల రని నారదుండు తలంచెను. ఆబాలునియెడ నాతఁడు కరుణ వహించి యిట్లనెను: "ధ్రువుఁడా! శ్రీహరియే మోక్షమునకుఁ గర్త. ఆతని మించినదైవము మఱియొకఁడు లేఁడు. నిన్నీ[illegible]ంబునకు ప్రేరేపించినవాఁ డాతఁడేయని తలంపుము. మానవు[illegible]సంసారసాగరంబును ధరించుట కాతనిపాదసేవయే నుపాయము.

కావున నీ వమ్మహాత్మునే యారాధింపుము. శ్రీహరింగూర్చి నిర్మలచిత్తముతోఁ దపస్సు సేయుటకుఁ దగిన ప్రదేశ ముండ వలయును. యమునానదీతీరంబు నున్న మధువనమున నీకుఁ దపమున కుచితమైయుండును. నీ వా వనమును బ్రవేశించి భగవంతుం డగు శ్రీహరిని మనంబున నిలిపి, యేకాగ్రస్థిత మానసుఁడవై తపం బొనర్పుము." అని పలికె, యక్కుమారు నకు వాసుదేవమంత్రము నుపదేశించెను.

ధ్రువుఁడు, నారదునకు నమస్కరించి యాతనిచే మార్గము చూపఁబడినవాఁడై యమునాతటంబున నున్నమధువనం బున కేగెను.

ధ్రువుఁడు నగరము విడిచి యరిగినసంగతి యుత్తాన పాదుఁడు విని, యతనికై మనంబున ననేకవిధములు పరితపించుచు, బెంగఁగొని, నిద్రాహారములుమాని, రాజకార్యములు విడిచి నానాఁటికి శుష్కించుచుండెను. నిశ్చయముగా నాతనికి ధ్రువునిపైఁ బ్రేమ లేకపోవలేదు. సురుచియం దున్నమోహముచే నామె ధ్రువుని నాడినపరుషోక్తుల సహించెను. ఇప్పు డాతఁడు వానిం దలఁచుకొని దుఃఖింపఁదొడంగెను. ఇట్లుండ నాతనికడకు నారదుఁడు వచ్చి, యాతని దుఃఖకారణం బెఱింగి "రాజేంద్ర! నీవు ధ్రువునిఁగూర్చి విచారింపవలదు. ఆతఁడు శ్రీమన్నారాయణునిఁ బ్రసన్నునిఁ జేసికొని, సమస్తలోక

పాలావళి కందరానిదివ్యపదంబు నంది, విలవిల్లును. నీకీర్తియొల్ల లోకంబున శాశ్వతముగాఁ బ్రకాశఁ జేయును. సుఖమైయుండుము. కుమారుని నీవు త్వరలోనే చూడఁగలవ" వని చెప్పి చనెను. నారదునివాక్యములవలన నుత్తానపాదుఁడు కొంత ధైర్యము వహించియుండెను.

— తపస్సు —

మధువనంబుఁ జేరిన ధ్రువుఁడు యమునానదిలో స్నానమాచరించి, తపమునకుఁ దగినప్రదేశముఁ జూచుకొని, పరమేశ్వరుం డగు పుండరీకాక్షుని మనంబున నిలిపి, యాఱుమాసములు కఠినదీక్షం దపము చేసెను. ఆతనితపమునకు దేవతలెల్లరును భయం బంది శ్రీమన్నారాయణునిసన్నిధి కేగి విన్నవించిరి. జగదీశ్వరుం డగురమాకళత్రుఁడు సురులం గాంచి "అసురులారా! ఉత్తానపాదపుత్రుం డగుధ్రువుఁడు నాకొఱకిట్లు ఘోరతపస్సు సేయుచున్నాఁడు. మీరు భయమందవలదు. నే నేగి యాతని తపము వారించి వచ్చెద" నని పలికి, యాక్షణంబుననే మధువనంబునకు వచ్చి, తన్నుఁగూర్చి యేకాంగుష్ఠమున నేల మోపి తపము సేయుచున్న ధ్రువునిఁ జూచి యాశ్చర్యమంది, సమీపించి నిలచియుండెను. ధ్రువుఁడు కన్నులు తెఱచి, దివ్యమంగళవిగ్రహుం డగునారాయణునిఁ జూచి, యతఁడే తన్నుఁ గృతార్థునిఁ జేయుటకు

వచ్చినభగవంతుండని తలంచి, తత్పాదపద్మములకు నమస్క రించి, స్తోత్రము సేయ నిశ్చయించెను. కాని, బాలుం డగుటచే భగవంతునేవిధంబున స్తుతింపవలయునో తెలియదయ్యెను. శ్రీహరి యక్కుమారునిభావం బెఱింగి, వేదవాక్కులచేఁ బూజింపఁబడిన తనశంఖముచే నాతనికపోలతలం బంటెను దానం జేసి, ధ్రువునకు మహావిజ్ఞాన మలవడెను. శరీరబలము హెచ్చెను. శంఖమువలన భగవంతునివాఙ్మయ మైనదివ్యతేజ మాతనియందుఁ బ్రవేశించెను. అంతట నాతఁడనేక విధంబుల సంస్తుతించెను. సత్యసంకల్పుఁడును సుజ్ఞానయు నగు ధ్రువునిభక్తికి సంతసించి శ్రీహరి యాతని విలోకించి యిట్లనెను.

"క. ధీరవ్రత రాజన్యకు
మారక నీహృదయమందు మసలినకార్యం
బారూఢిగా నెఱుంగుదు
నారయ నది వొందరాని దైనను నిత్తున్."

"అది యెట్టిదనిన నెందేని మేదినియందుఁ బరిభ్రామ్యమాణగోచక్రంబునుంబోలె గ్రహనక్షత్రతారాగణ జ్యోతిశ్చక్రంబు నక్షత్రరూపంబు లయినధర్మాగ్నికశ్యపశక్రాలును, సప్తర్షులును, దారకాసమేతులై ప్రదక్షిణంబులు దిరుగుచుండుదు, రట్టిదురాపంబును,ననన్యాధిష్ఠితంబును, లోకత్రయ ప్రళయకాలంబునందు నశ్వరంబు గాక ప్రకాశమానంబును

నయిన ధ్రువక్షితి యనుపదంబు ముండట నిరువదియాఱువే లేండ్లు సనం బ్రాపింతువు."

నీతండ్రి నీకు రాజ్యాభిషేకముం గావించి తపోవృత్తి నుండుటకు వనంబున కరుగును. నీయనుజుండగు నుత్తముండు వేటకై యరణ్యమున కరిగి యచ్చట మృతుం డగును. ఆతని నన్వేషించుచుం బోయి నీపినతల్లి యగు సురుచియు మరణం బందును. ధ్రువా! నీవు రాజ్యము సేయుచున్నప్పుడు నన్ను గూర్చి యాగములు సేయుము. కావలసిన సౌఖ్యభోగముల ననుభవింపుము. అంత్యకాలమున నన్ను స్మరింపుము. పునరావృత్తిరహితంబును, సప్తర్షి మండలోన్నతంబునునగుదివ్యపదము నందగలవు."

భగవంతుం డగు హరి ధ్రువున కట్లు వచించి యంతర్ధానం డయ్యెను. అంతట ధ్రువుండు సంతోషాంతరంగుండై నిజపురమునకు మరలి వచ్చుచుండెను. ఈతడు వచ్చుచుండుట చారులు చూచి కడురయమునం బోయి యుత్తానపాదున కెఱింగించిరి. కుమారుం డెప్పుడు వచ్చునాయని వేచియున్న యారాజేంద్రున కావార్త మహానందమును గలుగంజేసెను. కుమారునివార్త దెలిపిన చారుల కాతం డనేకబహుమతుల నొసంగి, యిరువురు భార్యలును, నుత్తముండును, మంత్రి పురోహితులును వెంటరాం గుమారునకెదురుపోయెను. ఈతం



సీతండ్రి.................................నందగలవు.

డు నగరసమీపమున నున్న యుద్యానవనమున వచ్చుచున్న ధ్రువునిఁ జూచి, యానందబాష్పములు విడుచుచుఁ గౌఁగలించుకొనెను. ధ్రువుండును దండ్రికిని, నిరువురు తల్లులకును నమస్కరించి, తమ్ముఁ డగు నుత్తమునిఁ గౌఁగలించుకొనెను. ఇప్పుడు సునీతి పొందినయానందమునకు మేర లేదు. సురుచియు మున్ను దా నాడినమాటల మఱచి యుక్కుమారునిఁ జేరి "వత్సా! భగవదనుగ్రహము వడసినవారి కెట్టి కొఱంతలు నుండవు. కమలలోచనుని బ్రసన్నునిఁ జేసికొనినవారు మృత్యుంజయులైనను గలుతురు." అని పలికెను. అనంతర ముత్తానపాదుఁడు ధ్రువుని గజారూఢునిఁ జేసి పురంబులోనికిఁ దోడ్కొని వచ్చెను. ధ్రువుని రాకకుఁ బ్రజ లెల్లరు సంతోష మంది, తమ సంతోషమును బ్రకటించుటకుఁ దమతమగృహములన్నియుఁ దోరణములచే నలంకరించిరి.

శ్రీహరినిఁ బ్రసన్నునిగాఁ జేసికొని ధ్రువునిఁ జూచి యానందించుచు, నుత్తానపాదుఁడు కొన్ని సంవత్సరములు రాజ్యపాలనం బొనర్చి యుక్తవయస్కుఁడై యున్నయక్కుమారునకు రాజ్యాభిషేకము గావించి, తృప్తుఁడై తపోవనంబును బ్రవేశించెను.

ధ్రువుఁ డఖిలప్రజారంజకుఁడై ధరాతల పరిపాలనం బొనర్చుచుండెను. ఈతనితమ్ముఁ డగు నుత్తముఁడు మృగయా

విహారమున నరణ్యమునకరిగి, హిమాచలప్రాంతమున నొక్క యక్షునిచే హతుండయ్యెను. ఆతనితల్లి యగుసురుచి కుమారునికై వగచుచుం బోయి గహనదహనంబున దగ్ధయయ్యెను. ధ్రువుఁడు తమ్మునిమరణము విని మిగుల దుఃఖించి, యందులకుఁ గారణము యక్షుఁడని యెఱిఁగి, యప్పగ సాధింపఁ దలఁచి, రథంబెక్కి శరశరాసనపాణియై చని, హిమాచల ప్రాంతమున నున్న యక్షనివాసం బగునలకాపురంబుఁ గాంచి, యందలి యక్షులతో యుద్ధమునకుఁ గడంగెను. యక్షులకును నీతనికిని భయంకరమైన యుద్ధము జరిగెను. అందు యక్షులనేకులు మడసిరి. అప్పుడు స్వాయంభువమనువు ధ్రువునికడ కరుదెంచి, "వత్సా! మనకులమున కిది యనుచితమైనకర్మము. ఎవ్వఁడో యొకయక్షుఁడు నీతమ్మునింజంపెనని యక్షుల నెల్లఁ గూల్పఁ దలంచుట ధర్మమగునా? నీవు సామాన్యుఁడవుగావు; బాల్యమునఁ బిన్నతల్లి యాడినదురుక్తుల సహింపఁ జాలక, యరణ్యమునకుఁ బోయి, ఘోరతపం బొనర్చి హరిని బ్రసన్నునిగాఁ జేసికొన్న మహానీయుఁడవు. నీ వీయక్షులఁ గూల్చుటంజేసి సదాశివమిత్రుఁడైన కుబేరునియెడ నపరాధముఁ జేసినవాఁడ వైతివి" యని పలికి, యాధ్రువునిఁ గుబేరుని కడకుఁ దీసికొనిపోయి యిరువురకును సఖ్యము గూర్చెను. అనంతరము ధ్రువుఁడు నగరమునకు మరలి వచ్చెను.

ధ్రువుఁడు పెక్కేండ్లు భూమండలముఁ బరిపాలించి, యనేక క్రతువులు శ్రీహరిప్రీతిగఁ జేసి యశము గాంచి, తుదకు విరక్తుఁడై తనకుమారుని రాజ్యమునందు నిలిపి, తపంబుఁ జేసి కొనుటకు వనంబుఁ బ్రవేశించెను. ఆతఁ డాయరణ్యమున ఘోరమైన తపస్సు చేయుచుండఁగా నొక్కదినంబున నాతనికడ కొక్క విమానము వచ్చెను. ఆవిమానమున నున్నవారిని హరికింకరులుగాఁ దలంచి ధ్రువుండు వారికి నమస్కరించి నిలిచి యుండెను. విష్ణుదూత లాధ్రువునిఁ జూచి "ఓరాజా ! నీకు శుభం బగుఁగాక ! నీవు బాల్యమునఁ జేసినతపమునకు శ్రీమన్నారాయణుఁడు మెచ్చి నిన్నుఁ దోడ్కొని వచ్చుట కీవిమానమంపినాఁడు. నిన్నిమేము మాధవసన్నిధానమునకుఁ దోడ్కొనిపోవుదము. ఏపదంబునేని సూరిజనంబులు సర్వోత్తమంబని పొందుదురు. దేనిం జంద్రదివాకరగ్రహనక్షత్రతారాగణంబులు ప్రదక్షిణంబుగాఁ దిరుగుచుండునో, మఱియు నీదుపితరులచేతను, నన్యులచేతను, ననధిష్ఠితంబును, జగద్వంద్యంబును, భక్తజనాతిదుర్లభంబు నయిన యట్టివిష్ణుపదంబుం బొందుదువు. రమ్ము. ఇదే విమానము." అని పలికిరి. ధ్రువుండంతట భగవంతునకు మనంబున నమస్కరించి విమానమెక్కెను. అంత విమానము పోవుచుండెను. కాని, యాతని మనంబున భూతలంబున నున్న తల్లిం దలంచి చింతించుచుండెను.

ఈతనివిచారమును విష్ణుకింకరు లెఱింగి "రాజేంద్రా ! నీవు విచారింపవలదు. నీతల్లికూడ వేఱొకవిమానముపై నుత్తమ లోకమునకుఁ బోవుచున్న" దని పలికిరి.

ఇట్లు ధ్రువుఁడు విమానముపై నరిగి, గ్రహమండలమును, లోకోన్నత మగు సప్తముని మండలమును దాఁటి యవ్వల నుండు హరిపదమును గాంచెను.

ఆహా! ధ్రువా! బాలుఁడవై యుండియుఁ బినతల్లి యాడినదురుక్తుల సహింపఁజాలక, యరణ్యమున కేగిననీధైర్యము, మహోన్నతపదము నందఁ దలఁచి, స్థిరచిత్తమున హరిని సేవించి, యాతనిం బ్రసన్నునిగాఁ జేసికొని పరమభక్తుని దోడిబాలుర కాదర్శముగాఁ జేసితివికదా!

3 కుశలవులు

ఎవ్వఁడో యొకరజకుఁ డాడినమాటపై శ్రీరాముఁడు సీత నరణ్యములందు విడిచి రమ్మని లక్ష్మణున కాజ్ఞాపించెను. రామునియాజ్ఞ యనుల్లంఘ్యముకదా! రామునియానతి ననుసరించి సంపూర్ణగర్భవతియై యున్నసీతను లక్ష్మణుఁడు రథముపై నెక్కించుకొని పోయి వాల్మీకాశ్రమసమీపమున విడిచి వచ్చెను. వాల్మీకి సీతను దనయాశ్రమమునకు దోడ్కొని పోయి, తాపసకన్యల నామె కుపచారము సేయుటకు నియమించెను. వారును నామెయందుఁ గడుభక్తి గలిగి సేవించుచు, నే విధమయినకొఱంతయుఁ గలుగకుండఁ జూచుచుండిరి. సీతయు దనయెడల నట్టికరుణ వహించియున్న వాల్మీకిమహామునియందు వర్ణనాతీతమయినభక్తి గలదై యుండెను. సీతకు రామచంద్రుని విడనాడియుంటి ననుచింత దప్ప మరియొకచింత లేదు. కాలక్రమమున నామె కొకశుభదినమున నిరువురు నందనులు పుట్టిరి. ఆకుమారులకు వాల్మీకి జాతకర్మాది కర్మంబుల నిర్వర్తించి, కుశలవు లనుపేరులు పెట్టెను. ఆకుమారులు సీత చేతనే కాక, తాపసకన్యలచేతఁగూడ రక్షింపఁబడుచు దినదిన ప్రవర్ధమానులగుచు వాల్మీకికిని సీతకును సంతోషముఁ గలిగించుచుండిరి. తనయులఁ జూచుకొనుచు సీతకొంచెము దుఃఖమును మఱచియుండెను.

కుశలవులకు యుక్తవయస్సు వచ్చినయంతనే వాల్మీకి వారి కక్షరాభ్యాస మొనర్చి కాలక్రమమున సర్వశాస్త్రములును, క్షత్రియోచిత మగు ధనుర్విద్యయు నేర్పెను. అవి యన్నియు నట్లుండ నమ్మునీంద్రుఁడు రామాయణకావ్యమును రచించి దానిని వారిచే గానరూపముగఁ బాడించుచుండెను. కుశలవులు తమ బాలక్రీడల చేతను, నసమానమైన ధైర్యచర్యల చేతను, నాశ్రమవాసులకును, దల్లికిని గురువునకును మోదము గలుగజేయుచు విరాజిల్లుచుండిరి. అన్నదమ్ములు బాల్యముచే నొక్కొక్కప్పుడు వాల్మీకినే ముప్పుతిప్పలు పెట్టుచుందురు. నిద్రవోవునప్పు డాతనిగడ్డము లాగుచుందురు. దండము దాఁచుచుందురు. కమండలుజలముల బారఁబోయుచుందురు. ఆతాపసోత్తముఁడు వారికొంటెపనులకు నవ్వుచుండును. కాని కోపింపఁడు. తాతగారి నట్లు సేయవచ్చునా యని తల్లి కోపమందినప్పుడు వా రామెతో "ఆయన మాతాత. మే మేమి చేసినను నాగ్రహింపఁ" డని బదులు చెప్పి నవ్వించుచుందురు. ఇట్టికొంటెపనులే కాక వా రప్పుడప్పుడు సమీపారణ్యమునకుఁ బోయి, సింగములు, వ్యాఘ్రములు మొదలగుక్రూరసత్త్వములఁ బట్టుకొని తెచ్చి యాశ్రమమునందుఁ గట్టివేయుచుందురు. ఇట్టిసాహసకార్యము వలదని తల్లి చెప్పినచో "తల్లీ! మాకు భయము లేదు. నీకుఁ గావలసినచోఁ బులిపిల్లల నెన్ని

మైనఁ దెచ్చి పెంపుడుకుక్కలవలెఁ జేయుఁడు" మని పలికి వారు తెచ్చినమృగముల నామెయొద్ద కీడ్చుకొని వచ్చుచుందురు. ఒక్కొక్క సమయమున నాసీత యాకుమారుల చర్యలఁ జూచి, తనమనంబున "కుమారోదయభాగ్య మంది నే నీవాల్మీకాశ్రమమున నుంటి నని రామునకుఁ దెలియునా? తెలిసియున్నచో నన్నేల పురికిఁ దోడ్కొనిపోవక యుండును? అయ్యో! ఇది యేమియూహా! లోకాపవాదముఁ బాపుకొనుటకుఁగదా యాతఁడు నన్నుఁ బరిత్యజించినాఁడు. అట్టిచో నాకు మరల జీవితేశ్వరుని దర్శనభాగ్యము లభించునా! ఈసుపుత్రోదయముఁ గాంచి కౌసల్యామహాదేవి యెంత యానందించియుండునో! భరతాదు లెంత సంతోషము పొందుదురో? ఉభయకులవర్ధను లగుపుత్రులఁ గాంచి నాతండ్రియగు జనకుఁడెంత సంబరము నొందునో! రఘుకులనిస్తారకు లగువీరిజన్మమహోత్సవ మెంత వైభవముగా జరిగియుండునో" యని పరిపరివిధములఁ దలచుచుండును.

కుశలవుల కొంచెము బుద్ధి తెలిసినవా రగుటచేత వారప్పుడప్పుడు తల్లిం జేరి "మాతండ్రి యెవ్వరు? ఎచ్చట నున్నాఁ" డని యడుగుచుందురు. వార ట్లడిగినప్పుడెల్ల జానకి కన్నీరు గార్చుచుఁ దనదుఃఖమును బయలుపఱచక యేవో మాటలచే వారిని మఱపించి, వారివలన రామాయణకావ్యగానము వినుచుండును.

—♦ యజ్ఞాశ్వము ♦—

కుశలవులు సంపూర్ణాస్త్రశస్త్రవిద్యాధురంధరులై విరాజిల్లుచుండిరి. వారి సాహసకార్యములకుఁ దాపసజనులును, సీతయుఁ గూడ మిగుల భయమందుచు వారింపుచు వచ్చిరి. కాని, పుష్ప ముద్భవ మైనతోడనే పరిమళం బబ్బు నన్నట్లు నిరుపమానమైన క్షత్రియశౌర్యము దాఁగునా?

బ్రహ్మలోకమున జరుగు దీర్ఘతరసత్రయాగమునకు వాల్మీకిమహర్షి యరుగఁదలఁచి కుమారసహితయై యున్నసీత కడ కాతఁడు వచ్చి "కుమారీ! బ్రహ్మలోకమున నొకగొప్ప యాగము జరుగుచున్నది. దానిం జూచుటకు నే నాహ్వానింపఁ బడినాఁడ. పోవక తప్ప దయ్యెను. అతిథ్యభ్యాగతపూజలఁ గూర్చి తపస్వినీజనంబులకుఁ జెప్పియున్నాను. సకలముఁ దెలిసిననీవును వారిసి దగినవిధమున నడపుచుండుము. నేను సత్వరముగనే మరలివత్తు" నని పలికి, యామె ప్రక్క నున్నకుశలవులఁ గాంచి "కుమారులారా! దుడుకుపనులను, సాహసకార్యములును సేయక, నేను వచ్చువఱకును, రామాయణపాఠములఁ జదువుకొనుచు, నాశ్రమమున కేవిధమైన భయము గలుగకుండఁ గాపాడుచుండుఁ" డని చెప్పెను. "మే ముండఁగా నాశ్రమమునకు భయమా? కుశలవులు ధనుర్ధరులై

యున్నంతవఱకు మనయాశ్రమమును దేవతలైనను దేరిచూడఁజాలరని కుశలవులు వాల్మీకికి నవ్వువచ్చునట్లు పలికిరి. తరువాత వాల్మీకి బ్రహ్మలోకమున కరిగెను.

వాల్మీకి యాశ్రమమున లేఁడుకదా యని లవుఁడు తనవెంట నొక మునికుమారుఁడు రా, నరణ్యమధ్యమునకు దుష్టమృగములఁ బట్టుటకుఁ బోయెను. మునికుమారుఁ డాప్రదేశమునకుఁ బోవలదని చెప్పినను లవుఁడు వినలేదు. లవుఁ డరణ్యమధ్యమునకుఁ బోయి క్రూరమృగములకై వెదకులాడుచుండ, దూరమునుండి యాతనికేదియో యొక గొప్పధ్వని వినవచ్చెను. అది యేమై యుండు నని పరికించుచుండఁగా నొకసైన్యము వచ్చుచుండుట యాతనికి గోచరమయ్యెను. అంతలో 1 రామునిచే విడువబడినయజ్ఞాశ్వము ముందు వచ్చెను. దానిని సమీపింపవలదని మిత్రుఁడు వారించుచున్నను, వినక లవుఁ డాయశ్వమును బట్టుకొని, దానినుదుట గట్టబడిన బిరుదుపట్టమును జదివి, తనహితుని విలోకించి "చూచితివా! ఇయ్యది రాముని యజ్ఞాశ్వమట. వీరులయినవారు దీనిని బంధింపవచ్చునట. సరేనేను వీరుఁడను గావున బంధించెదను" నని చెప్పి తనయుత్తరీయముచేఁ దానిని బంధించి తీసికొనిపోయి యొక వృక్షమునకుఁ గట్టివైచెను. అంతట శత్రుఘ్నుని సైన్యము

1. శ్రీరాముఁ డశ్వమేధయాగము సేయ దీక్షఁ బూని తురంగము భూతలమంతయుఁ జరించిరా విడచెను.

వచ్చి యశ్వము బంధింపబడియున్న ప్రదేశమునకుఁ గొంతదూరములో నిలిచియుండెను. అశ్వము బంధింపబడి యుండుటఁ జూచి, శత్రుఘ్నుని సేనానాయకుఁడు వచ్చి లవునిఁ జూచి, "ఈయశ్వమును బంధించినవాఁడెవఁడు? నీవేనా! అట్లయినఁ దాపసకుమారుఁడవగు నీకు దీనితో నేమి పనియున్నది? విడువు" మని పలికెను. ఆపలుకులకు లవుఁడు "ఓయీ! బంధించిన యశ్వమును నే నెట్లు విడుతును. వీరులుండినఁ బట్టుఁడని దీనియాళికభాగమునఁ గట్టఁబడిన బిరుదుపట్టముఁ జూచి, నేను వీరుఁడనగుటచేతనే పట్టితి" నని భీకరముగాఁ బలికెను. వీరిరువురు సంభాషించుచుండగా నయ్యెడకు శత్రుఘ్నుం డరుదెంచి క్రతుతురంగమును విడువు మని లవునకుఁ జెప్పెను. అతఁడు శత్రుఘ్నుని జూచి "రాజా! అఖండపరాక్రమ ముండుటచేతనే నే నీయజ్ఞాశ్వమును బంధించితిని. రుద్రుఁడు వచ్చినను నేను దీనిని విడువను. నీవు సౌర్యము గలవాఁడవేని విడిపించుకొనుము." అని ప్రత్యుత్తర మిచ్చెను.

లవునివేషము మునికుమారభ్రమ నొదలించెను. ముఖలక్షణములు వాక్చాతుర్యము క్షత్రియబాలునకు వలె నుండెను. అట్టివానితోఁ బోరుట కిష్టము లేక శత్రుఘ్నుఁ డిట్లు పలికెను. "మునిబాలకా ! తాపసకుటీరములందు వైదికవిద్యల నభ్యసించు మీకు క్షత్రియులతోఁ గలహమేల? యుద్ధ

మనిన నేమనుకొంటివి? అందు మిగుల భయముగలిగించుగంధే భములేగాని, కందుకములైన హరిణములు గావు. అగ్నికీలలం జిమ్ముశరగములే కాని, పరమేశ్వరు నర్చించుపుష్పములుగావు. వీరాగ్రేసరుల భయంకరసింహనాదములే కాని, వేదఘోష ణము కాదు. నీవేమి, మాతోం బోరుసలుపు టేమి? నీవు బాలుండ వగుటచే నట్లు పలుకుచుంటివి. నీచిన్నతన పుమాటల విడువుము. ఈయశ్వమును నీవు తెలియక బంధించి తివి. దీనిని విడిచిపుచ్చి నాతోం బురంబునకు రమ్ము. నీ కశ్వము గావలసినచో మఱియొకదాని నిచ్చెద. నిన్నుం జూచిన నాకు ముద్దు వచ్చుచున్నది నీవునాతో నరు దెంచితివేని మహారాజేంద్రుడు సేయుచున్నయజ్ఞమహోత్స వముం జూడవచ్చును. యజ్ఞదినము లన్నియు నీ వచ్చటనే యుండి షడ్రసాన్నభక్ష్యభోజ్యంబులం గుడువవచ్చును. ఇదియుం గాక నీకు రత్నహారములు గాని, వస్త్రములుగాని, భూము లు గాని యొసంగెదను." అని పలికినమాటలకు లవుండు "నీవు దాతవు గాన నిచ్చెదవు. నీదానమును స్వీకరించుట కిచ్చట నెవ్వరును సిద్ధముగ లేరు. లంచ మిచ్చి హయమును గొనిపోవుట నీవంటి యుత్తమక్షత్రియునకుం దగదు. కావున నీమాటలు చాలించి చేతనైనచో యుద్ధము సేయుము. లేదే ని వచ్చినదారినిం బొమ్ము" అని నిర్భయముగాం బ్రత్యుత్తర

మిచ్చి, రణమునకు సంసిద్ధుఁ డయ్యెను. శత్రుఘ్నుఁడు తొలు త సందేహించుచుఁ బోఁ వలిపెనుగాని, లవునియస్త్రసంధాన చాతుర్యముఁ గాంచి, తీవ్ర మైనపోరాటమునకుఁ గడంగి యా లవుని మూర్ఛిల్లఁ జేసి రథముపైఁ బెట్టుకొని, యశ్వమును విడి పించుకొని పోవుచుండెను.

ఆశ్రమమున లవుఁ డింకను రాలే దని విచారించుచు సీత యొంటరిగా నుండెను. ఆసమయమున మునిబాలు, డగిరి లవునివృత్తాంతము దెలిపెను. ఆవృత్తాంతము విన్నంతనే యా మె మూర్ఛిల్లి లేచి, "హా! నందనా! పావకజ్వాలలచందమున హృదయమును దహించివైచుచున్న పతినిరాకరణమునకుఁ దో డు, నాకుఁ బుత్రవియోగముఁ గూడఁ దటస్థించినదా! అక్కటా! నే నెట్లు దీనిని భరింతును. అరణ్యమున నున్న మన కామఖవా జితో నేమిపని వచ్చినది. పూర్ణేందుమండలమును ధిక్కరించు నీముఖపద్మమును జూచిన నెట్టివారైనను ముద్దువెట్టుకొందురే అట్టియెడల నీపై దారుణశరప్రయోగము సేయుట కారాజేం దుఁడిన కెట్లు చిత్తము సమ్మతించెను? పురాకృతకర్మఫలమున భర్తచేఁ బరిత్యజింపఁబడి, యరణ్యమున నున్నను గుమారు లగు మిమ్ముఁ జూచుకొనుచు దుఃఖము దిగమ్రింగి యుంటిని. కుమారా! లవా! నీముద్దుముచ్చటల నెట్లు మఱతును. ఒక్క నిమిషమైనను విడువఁజాలనినీయన్న నెట్లు విడిచితివి? నీతండ్రి

చేయుగా రాబముఁ జూపవైతివి. అవ్వాలకు నీకుద్దు ముచ్చటలఁ జూపవైతివి. తనయనంతరము మిథిలానగరరాజ్యలక్ష్మికి సీతా సంతానమే యాధిపత్యము వహించు నని సంతోషముతో నుండుమీతాత యగుజనకరాజఋషి మొగ మైనఁ జూడలేదు. తండ్రీ! ఇంతలోనే నీకు నూరేండ్లు నిండెనా! దుర్భరం బైన యాశోకము నెట్లు భరింతును? నేను మిమ్ములఁ గంటి నని రామచంద్రునకుఁ దెలియకపోదనియుఁ గుమారసహిత నగునన్నెట్లో నగరమునకుఁ దోడ్కొనిపోవక మానఁడనియు గంపంత యాసతో నుంటిని. అట్టినాయాశ యంతయు వ్యర్థము చేసితివా!" యని పరిపరివిధముల విలపించుచుండెను. అప్పుడే యెచ్చటికో యరిగినకుశుఁడు వచ్చి తల్లిదుఃఖకారణం బెఱింగి యాతఁడుఁ గూడ విచార మంది క్రమ్మఱ ధైర్యముఁ దెచ్చుకొని తల్లిని విలోకించి "అమ్మా! నీవు విచార మందవలదు. ఈకుశుని శౌర్యాటోపవిజృంభణమును, నస్త్రవిద్యాపాటవమును, బరీక్షింపఁ దలఁచి, యానృపాలుఁడు లవునట్లు చేసినాఁడు. నీవు ధైర్యమున నుండుము. లవున కావంతయు నాపద సంభవింపదు. నేఁడు సూర్యుం డపరాద్రికిఁ జేరకమున్నె లవుని మూర్ఛవుచ్చినయానృపాలునిఁ దునిమి, మనలవునిఁ దెచ్చెద, నీకు ముదము గూర్చెద" నని పలికెను. అప్పలుకులకు సీత భయం బంది "నాయనా! సాహసము వలదు. ఎందు కీయుద్ధ

ము. నన్ను మఱింతదుఃసాగరమున ముంచెదవా? నాకన్నుల యెదుట నుండు" మనెను. "అమ్మా! నన్నుఁగూర్చి భయ మందవలదు. మూఁడవకన్నుఁ దెరచి, చేతఁ ద్రిశూలముఁ దాల్చి, రుద్రుఁడు వచ్చినను సంగరంబున వెనుదీయక, యద్వితీయశౌర్యాటోపమునఁ బోరాడి, విరోధిశిరముఁ దెచ్చి నీకచ్చనకాయలాట కిచ్చెద. నన్నాశీర్వదించి పంపు" మనిపలికిన కుశునిఁ గాంచి, యాసాధ్వి యగుసీత, యాతని నాశీర్వదించి పంపెను.

మూర్ఛ మునింగిన లవుని రథముపైఁ బెట్టుకొనిశత్రుఘ్నుఁడు పోవుచుండెను. "ఓయీ! రాజా! నీపరాక్రమమునకు లోకము పరిహాసించు ననియైనఁ దలంపవైతివే! పిచ్చుకపై బ్రహ్మాస్త్ర మన్నట్లు కన్నుదెఱవనిపసికూనపై దారుణాస్త్రము ప్రయోగించి మూర్ఛ పుచ్చి, రథముపై బెట్టుకొని పోవుచుంటివా? ఆహా! ఎంత శౌర్యశాలివి! ఎంత పరాక్రమవంతుఁడవు! ఇదిగో నీబాలికిఁ గాపుఁడనై వచ్చిననన్నుఁ జూడుము నిన్నిఁక నొకయడుగైన నావలకుఁ బోనియ్య" నని పలుకుచుఁ గుశుఁడు వచ్చి రథమున కడ్డముగా నిలిచెను.

"ఈబాలుఁ డెవఁడు? తాపసాస్త్రములయం దుండు వీరి కిట్టిశౌర్య మెట్లాపడెనోకదా! ముఖవైఖరిఁ జూడ మూర్ఛ నందిన బాలున కగ్రజునివలె నున్నాడు. ఏ కారణముచేతనో

వీరిం గాంచినవా కనురాగము కలుగుచున్నది. వీరిముఖలక్షణ ములు నాకు సీతామహాదేవిని స్మరణకుఁ దెచ్చుచున్నవి. నిందాని వారణార్థము కాంతారమధ్యమున విడువఁబడినసీతామహాదేవి యీపుత్రద్వయమును గనియుండునా? ఇప్పుడు నే నేమి సేయుదును ఈబాలవీరుఁడు రథము గదలకుండ నిలుపుచున్నాడు" అని మనంబునఁ దలఁచి, యాశత్రుఘ్నుఁడు కుశునిఁ గాంచి "తాపసబాలకా ! నీవు నారథము నిలువరించితివేల ? నీవు నాతో యుద్ధము సేయఁదలఁచితివా యేమి? అట్టియుద్దేశమున్నచో నీతమ్మునిస్థితిఁ దలఁచుకొమ్ము" అని నుడివెను.

ఆమాటలకుఁ గుశుఁడు దండతాడితమహోరగముచందమున మండిపడుచుఁ "దాపసబాలకుఁ డని నన్నుఁ దలంపకుము. వట్టిగొడ్డున కఱపు లెక్కువయనునట్లుల యీలీలఁ బ్రగల్భములాడెదవు? చేతనైనచో యుద్ధము సేయుము. లేదేని నన్ను శరణుఁ బొందుము. రక్షించెద" నని నిర్భయముగాఁ బలికెను. ఇంతలో రథముపై మూర్ఛ నందియున్నలవుఁడు లేచి, రథము నుండి లంఘించి, కుశునిఁ జూచి మహానందమును బొందెను. ఇరువురును నశ్వినీకుమారులవలెఁ దేజరిల్లుచు శత్రుఘ్నునిఁ దాఁకిరి. వారివారిశరలాఘవమునకును గరలాఘవమునకును, శత్రుఘ్నుఁ డద్భుత మంది యతితీవ్రముగఁబోరుసలిపెనుగాని తుదకుఁ గుశునిబాణముచే నేఁబడి మూర్ఛిల్లెను. అంతఁగుశ

లవులు మఖాశ్వమును బంధించుకొనిపోయి, పూర్వపుప్రదేశమునఁ గట్టివైచి తమవిజయమును దల్లి కెఱింగించుట కొక్కమునిబాలునిఁ బంపిరి. మూర్ఛిల్లిన లవుఁడు వచ్చినందులకును గుమారులవిజయమునకును నామె మహానందము నందెను.

శత్రుఘ్నుఁడు రణమునఁ దాపసకుమారులచే మూర్ఛ నందె ననియు, యజ్ఞాశ్వము వారిచే బంధింపఁబడిన దనియుఁ జారు లరిగి రామున కెఱింగించిరి. రాముఁడు మిగుల విచారించి లక్ష్మణునిఁ బంపెను. బలసమేతుఁడై లక్ష్మణుఁ డరుదెంచి, "ఏమి కారణమో కాని, లోకైకసాధ్వియు, రామమయజీవితయు, నగుసీతామహాదేవి సాకేతనగరముఁ బాసినది మొదలు మాకుఁ గష్టములమీఁదఁ గష్టములు వచ్చుచున్నవి. ఆసాధ్వీమణి యిప్పు డెచ్చట నున్నదో? ఏతాపసోత్తమున కామహాదేవి నాదరించుభాగ్యము లభించినదో! నే నీజన్మమున నాభువనమాతను సేవించుభాగ్యము గందునా!" యని తలఁచుచు, నశ్వము బంధింపఁబడినవృత్తమును సమీపించి యచ్చట నున్న కుశలవులఁ గాంచెను. లవుఁ డాతనిఁ గాంచి "ఏమి! దొంగవలె వచ్చుచుంటివి? కన్నుచాటుగ నున్నచో నశ్వమును దీసికొని పోవఁదలఁచితివా?" యని పలికెను. ఆమాటలకు లక్ష్మణునకు నవ్వును గోపము ననురాగము వారిపై నొకసారిగఁ గలిగెను. ఆతఁడు వారిం గాంచి యిట్లు పలికెను. "బాలకులారా! మీ

చిన్నతనపుమాటల విడిచి యిల్లు వెడలుడు. మీరు మునికుమారులు; మేము రాజులము. మీరు మాకనవసరముగ నాగ్రహమొనవు కార్యముచేసినారు. మీ రీయజ్ఞాశ్వము నవిడువుడు. సౌందర్యమునందు మీరు కంతుజయంతులఁ బోలియున్నారు. మీతో రణ మొనర్చి మిమ్ము మ్రందించుటకు నాకుఁ జేతులాడవు. నాపరాక్రమముఁ గూర్చి మీ రెఱుంగరు. మున్ను రణమున రావణునిపుత్రుఁ డగు నింద్రజిత్తును గూల్చినాఁడ."

అప్పలుకులు విని కుశుఁడు ధనువు ధరించినయట్టి వారితో యుద్ధము సేయుటకే మేమిచ్చట నశ్వము నుబంధించితిమి పురహూతుఁడు వచ్చినను భయమందము. ఇంద్రజిత్తును గూల్చినవాఁడ నని నీవు చెప్పుకొనుచున్నందులకు నవ్వువచ్చుచున్నది. నీపరాక్రమప్రకటన మింకఁ జాలింపుము. ఈసంగతి మాకిదివఱకే తెలియును. అతనిఁ జంపుటకు నీవు పడినకష్టమెఱుంగుదుము. ఆతఁడు నిన్నే డాటలాడించలేదా? తుదకు నీవు "నాయగ్రజుఁ డగు రాముఁడు సత్యసంధుఁడగునేని యీశరము నిన్నుఁ గూల్చుఁగాక యని యాశరము నతనిపైఁ బ్రయోగించినావు. ఇందు నీప్రయోజకత్వ మేమున్నది? ఈగౌరవము రామునకేకదా" యని నిర్లక్ష్యముగాఁ జూచుచుఁ బలికెను. లక్ష్మణుఁడు క్రోధరసపూరితచిత్తుఁడై రణమునకుఁ దలపడెను. కొంతసేపు యుద్ధము జరిగినపిదప సౌమిత్రికిఁ గుశలవు

పరాక్రమము పూర్తిగాఁ దెలిసెను. లక్ష్మణునిచేఁ బ్రయోగింపఁబడుచున్న శరములన్నియుఁ గుశలవులచే ఖండింపఁబడుచుండెను. తుదకు మహాపరాక్రమైకధనుఁ డగులక్ష్మణుఁడు తన శౌర్యము సన్నగిల్లి కుశలవుల బాణప్రహారములచే మూర్ఛనందెను.

లక్ష్మణునివార్త రామునకుఁ దెలిసెను. అంతటనాతఁడును, భరతుఁడును నాంజనేయాదులును బయలుదేరి వచ్చిరి. భరతుఁడు గూడఁ గుశలవులఁ దాఁగి శత్రుఘ్నుని మార్గము ననుసరించెను. తమ్ములస్థితిఁ గాంచి, రాముఁడు మహాదుఃఖసాగరమున మునింగెను. ఆతఁడు తనమనంబున "అక్కటా! పుండుపైఁ బుల్లయున్నట్లు జానకియెడఁ బాటునకు దుఃఖించుచు వసిష్ఠమునిప్రబోధితుఁడ నై యశ్వమేధయాగదీక్షాబద్ధుఁడ నైతిని. దీనిమూలమున నాతమ్ములఁ గోల్పోయితిని. పరమసాధ్వీమణిని, నమూల్యసద్గుణమణిని, నా సేవతప్ప నితరమెఱుంగని సాధుశీలను, బరిపూర్ణగర్భవతిని నరణ్యములకుఁ బంపిన పాపము నన్ను బాధింపక విడుచునా? ఆ సుచారిత్రి కంటనుండి వెలువడు నొక్కొక్క బాష్పబిందువున కొక్కొక్క కష్టము గలుగకయుండునా? అక్కటా నాజీవితము వ్యర్థమై పోయినది. హా! తమ్ములారా! నా మూలముననఁగదా మీ కిట్టిపాటు సంభవించినది? లక్ష్మణా! భ్రాతృవత్సలా! నీవంటి



ఆతఁడు...చెప్పెను.

సౌర్యశాలినిగూడ మునికుమారులపాట్టకిఁ బెట్టితిని. అతికా
యుని వధించిన నీసౌర్య మేపంచకుఁ జేరినది? కుంభనికుంభాది
ప్రముక్కుడిరక్కసుల నుక్కడగించినవిక్రమ మేనీటఁ గలసినది?
మేఘనాదుని దుర్వారగర్వం బడంచి కాలునివీటి కంపినయస్త్ర
విద్యాధురంధరత్వ మేమూల డాఁగినది! సౌమిత్రీ నేను ని
న్నెట్లు మఱవఁగలను. నన్నుఁ బాయఁజాలక యరణ్యములకు
నావెంట వచ్చినావు. నిద్రాహారములు మాని, పదునాల్గుసంవ
త్సరములు నాకు సేవలు చేసినావు. నాకష్టసుఖములే నీకష్ట
సుఖములుగ భావించినావు. నిరంతరము నాయాజ్ఞ శిరమున
ధరించి మెలంగినావు." అని చింతించుచు నెమ్మదిగా నశ్వము
బంధింపఁబడియున్నవృక్షమును సమీపించెను. అచ్చటఁ గుశ
లవు లుండిరి. వారు రామునిఁ జూచి యద్భుత మందిరి. ఆత
నిం జూడఁగనే వారి కొకవిధమైన సంతోషమును ప్రేమయుఁ
గలిగెను. రాముఁడు వారిం జేరి, తద్రూపములు, మోములు
కమనీయదేహకాంతులు చూచినయంతనే యతని కన్నులయె
దుట సీతాప్రతిరూపము చిత్రింపఁబడినట్లుఁ గన్పట్టెను. అతఁడు
నెమ్మదిగా వారిం బల్కరించి యజ్ఞాశ్వమును విడువుఁ డని
చెప్పెను. కుశలవు లనేకవిధము లయిన చమత్కారవచనము
లతోఁ బ్రత్యుత్తరము లిచ్చిరి. రామునకు నవ్వు వచ్చుచుం
డెను. ఆకుమారులతో యుద్ధము సేయుట కతని చిత్తము సమ్మ
తించుటలేదు. అతఁడు వారిని విలోకించి "కుమారులారా!
మీ సాహసచర్యలు నా కత్యద్భుతముఁ గొలుపుచున్నవి.
మీరు తాపసపుత్రులు. వనంబునఁ దపోవృత్తి నుండువారలు.

అట్టిమీకు మాతో విరోధ మేల? బ్రాహ్మణులకు యుద్ధ ముతో నేమిపని యున్నది? అది క్షత్రియులకే విధింపఁబడి యున్నది. కావున నామాటలు వినుఁడు. మీకు రత్నహార ములుగాని, కుంజరములుగాని, పీతాంబరములుగాని, హారులు గాని, యిచ్చెదను. ఇంతయేల సాకేతనగర రాజ్యమున నర్ధభాగ మిమ్మన్న నిచ్చెద. క్రతుహయమును విడువుఁడు." అని పలికి తాను రాముం డగుట నెఱింగించెను. అందులకుఁ గుశలవులిట్లు పలికిరి. "మహారాజా! నీవు చక్రవర్తివి. నిరంకుశశాసనుండవు. నీయాజ్ఞ కాదనువా రెవ్వరు? నీ విచ్చుదానమున కడ్డము గలి గించువా రెవరును లేరు రాజ్యమం దర్ధభాగ మంటివి. అట్టి యపేక్ష మా కిప్పుడు లేదు. ముందుమాట యెట్లుండునో చెప్పఁజాలము. శుభప్రదములైన రుద్రాక్షలుండఁగా, మాకు రత్నహారము లేల? నారచీర లుండఁగాఁ బీతాంబరము లేల? పర్ణశాల లుండఁగా మణిమయమందిరము లేల? వన్యఫలము లుండఁగా షడ్రసాన్నపాయసభోజన మేల? వనమృగబల ముండఁగా గరిరథాశ్వబల మేల? సంతతపరమేశచింతనాసక్తుల మగుమాకు భూపరిపాలనాసక్తి యేల? ఓ మహారాజా! ఆవిషయము లట్లుంచుము. కరంబుల ఖడ్గంబులను, బాణంబు లను, ధరించి పరాక్రమశౌర్యములే ధనముగా భావించుమాకు వీనితో నేమిపని యున్నది? మావంటివారు చేత ఖడ్గము ధరిం చుట యలంకారార్థము కాదు. యుద్ధభూమియే శూరులకుఁ గ్రీడాప్రదేశము. అదియే యిహపరలోకములలో వీరునకుఁ గీర్తిదెచ్చునది. అదియే సకలసౌభాగ్యప్రదము. అదియే ధర్మ సంరక్షణార్థమై వీరులు రక్తమును శరీరములనుండి స్రవింపఁ

జేయుస్థలము. ఇంక నొకమాట వినుము. చక్రవర్తి వగుటచేత నీయానతిఁ దీర్చుటకన్న మఱియొక కార్యము లేదు. కాని కీర్తి గాంచుటకు మే మీయజ్ఞాశ్వమును బట్టితిమి. అట్టిదానిని మేము మరల విడువఁజాలము. దేవా! రామచంద్రా! అర్క కులవారాశిచంద్రా! భవదీయదివ్యమంగళవిగ్రహసందర్శనమున మేము ధన్యులమైతిమి. సముద్రబంధనసమయమున నిన్ను సేవించుచు వెంట నరుదెంచిన కపులకన్న నెక్కుడు ప్రేమతో నుడుతను లాలించినావు. పరమనిష్ఠాగరిష్ఠులై తపం బొనర్చిన మునీంద్రులతోఁ దుల్యుఁడగునట్లుచేసి యక్షీణకరుణాకటాక్షమునఁ బక్షినాథునకు మోక్ష మిచ్చినావు. రావణవధానంతరమున నయోధ్యకు మరలివచ్చుచు భరతునికన్న ముందుగాఁ గిరాతనాయకుం డగు గుహునిసేమ మరయ హనుమంతునిఁ బంపినావు. భరద్వాజమునీంద్రుని సత్కారంబును శబరియిచ్చిన పండ్లును నొకతీరుగ భావించినావు. నీవు సార్వభౌమనాయకుండవుకాని కేవలము మానవుఁడవు గావు ధరాభారనివారణార్థము సూర్యకులమున రామరూపమున నవతరించితివి."

భావగంభీరత, చమత్కారము, భక్తి, వినయము, వీర రసముగలిగి వెలుగొందుచున్న యాకుమారశేఖరులవాక్యములకు రాముఁడు మిగుల సంతసించెను. ఆమాట లాతని రణ పరాఙ్ముఖునిఁగాఁ జేయుచుండెను. కాని వారు మాటలతో హయమును విడుచుట లేదు. అందుచే నాతఁడు తనవీరచరిత్రము కొంత వారికి వినిపించెను. దానిపై లవుఁడు రామునిఁ గాంచి "నీచరిత్రము మాకుఁ జెప్పనక్కఱలేదు. నిన్ను మేము చూడలే దనుమాటయే కాని నీకల్యాణవైభవముఁ

గన్నులారఁ దిలకించినాము. తిలకించుటయే కాదు. పెండ్లిభోజ
నముఁగూడఁ జేసినాము. నీమీఁద భక్తినిలుపుటయేకాక, జన
కాజ్ఞఁ బాలింప నటవికేగుటనీవెంట వచ్చినాము. నీసతీవియో
గము చూచుటయేకాక హృదయములు పగుల నేడ్చినాము.
కపులతోఁ జెలిమి వాటించుటయేకాక సేతువుఁ గట్టినాము.
వార్ధి దాఁటినాము. లంకలోఁ జొచ్చినాము. రక్కసులతోఁ
బోరాటఁ జూచినాము. రావణవధఁ గాంచినాము. సీతాపాతి
వ్రత్యపరీక్షఁ జూచినాము. సంతోష మందినాము. ఇఁక నేమి
కావలయు" నని పలికెను. అక్కుమారుని పలుకులకు
రాముఁడు వెఱఁగంది "యిదియంతయు మీరెచ్చటఁ జూచితి"
రని ప్రశ్నింప, వారు "వాల్మీకివ్రాసినకావ్యమున" నని బదులు
చెప్పిరి. రాముఁడు నవ్వెను. మఱికొంతసేపటికి గానవ్వు క్రోధ
ముగా మార్చుకొని, యశ్వమును విడువకయున్నచో వారి
కపాయము వాటిల్లునని భయపెట్టెను. అందులకుఁ గుశలవు
లిట్లనిరి. "నీవు సాక్షాద్విష్ణుఁడవు. నిన్ను గెలిచినచో మేము
త్రిలోకఖ్యాతిఁ బొందుదుము. లేక నీహస్తమునఁ జచ్చితిమేని
మోక్షలక్ష్మిం బొందుదుము. కావున మమ్ము భయపెట్ట
వలదు." అంతకంతకు వారి సంభాషణములు వీరరసముతోఁ
గూడుకొని, క్రమక్రమముగా సమరాభిముఖుఁ జేసినవి.
రాముఁడు బాలురపైఁ బ్రయోగించినశరములు వారికిఁ బుష్ప
హారములై యొప్పెను. రాముఁ డాశ్చర్యమంది నారాయణా
స్త్రము సంధించి విడిచెను. కుశలవు లయ్యస్త్రమునకుఁ గొంత
భయ మంది మరల ధైర్యమువహించి యొకయమోఘశరముఁ
బూని "మాతల్లి పరమసాధ్వి యయ్యెనేని యీభూపాలుఁడు

మూర్ఛ మునుంగుఁగాక" యని విడిచిరి. ఆయస్త్రము సోఁకి నంతనే రాముఁడు మూర్ఛిల్లిపడియె. వెంటనే కుశుఁడు రాముని కరాంగుళీయకమును గైకొనెను.

అప్పు డచ్చటి కాంజనేయుఁడు వచ్చి, బాలురం దాఁకెను. బాలురు వానిని దమయస్త్రమున బంధించి నిజాశ్రమమునకుఁ గొనిపోయిరి.

యజ్ఞాశ్వమును బంధించినకుమారు లేమయిరో, యెవరితోఁ బోరాటము సంభవించినదో యని వారికై పరితాపమందుచు నాశ్రమమున సీత యుండెను. అంతట బంధింపబడిన హనుమంతునితోఁ గుశలవు లాశ్రమమును జేరి ద్వారమునొద్ద హనుమంతుని గట్టి వైచి, వారు లోనికిఁబోయి తమకై యెదురు చూచుచున్న తల్లికి నమస్కరించి యిట్లు చెప్పిరి. "అమ్మా! మాతోఁ బోరినక్షత్రియులు లోకాతీతపరాక్రమోపేతులని చెప్పుటకు సందియము లేదు. తుదకు మాతోఁ గయ్యము సేయవచ్చిన మహానుభావుఁడు సాక్షాద్భగవత్స్వరూపుఁడే. ఆతనిం జూచినయంతనే మాకొక విధమైన యనురాగము భక్తియు నుదయించెను. మొదట నాతఁడు మాపై బాణములఁ బ్రయోగించినాఁడు, అయ్యవిపూలదండలై మాగళము లలంకరించినవి. అనంతర మాతఁడు నారాయణాస్త్రముఁ బ్రయోగించెను. మేము నిన్ను స్మరించి బాణమును విడిచి

తిమి. నీస్మరణము మేము చేసినయంతనే యాతఁడుమూర్ఛిల్లి నాఁడు. ఆతనివ్రేలనున్న యుంగరము మేము తెచ్చినా మని పలికి, దాని నామె కిచ్చిరి. సీత, యయ్యంగుళీయకమును జూచి హా! యని నేలఁబడి మూర్ఛిల్లి కొంతసేపటికి లేచి, యాతఁడు వారితండ్రి యగుట యెఱింగించెను. కుశలవులు తాము చేసిన యకార్యమునకువిలపించుచు నాఁకిటఁగట్టివైచిన హనుమంతునిఁ గూర్చి చెప్పిరి. సీతయాజ్ఞపై వారు హనుమంతుని బంధవిముక్తునిఁజేసి, యామెసన్నిధికిఁ దోడ్కొని వచ్చిరి.

హనుమంతుఁడు సీతం గాంచి యపరిమితానందమును బొందుచు నమస్కరించెను. సీతయుఁ గుశలవులును రామునిఁ గూర్చి విలపించుచుండఁగా బ్రహ్మలోకమునుండి వాల్మీకి యరుదెంచి సమస్తమును విని, వారిని జింతింపవలదని చెప్పి, రామాదులు పడియున్న ప్రదేశమునకుఁ బోయి, కమండలుజలంబును వారిపైఁ బ్రోక్షించెను. వెంటనే యందఱును లేచిరి. అనంతరము వాల్మీకి కుమారద్వయసహిత యగుసీతను శ్రీరామునిసన్నిధికిఁ దోడ్కొనిపోయి, సీత సౌశీల్యము వర్ణించెను. రాముఁడు కుమారులఁ గౌఁగలించుకొని హర్షాశ్రువుల విడిచెను. పిదప నమ్మహాత్ముఁడు సీతను గ్రహించి కుమారసహితుఁడై దమ్ములు మొదలగువారు వెంటరా నిజనగరమున కేగి యాగమును బూర్తిజేసి కుశలవులకుఁ బట్టాభిషేకముచేసెను.

---

4 అభిమన్యుఁడు.

అభిమన్యుఁడు పుడమిపైఁ జీవించియున్నది కొలఁదికాలమే యైనను నాతనిపవిత్రవీరచరిత్రము ప్రతిమానవుఁడు తనహృదయఫలకమున లిఖించుకొనునట్లు చేసినాఁడు. ఈతఁడు పాండవమధ్యముఁడగునర్జునునకుఁ గృష్ణసహోదరి యగుసుభద్రయందు జనించినవాఁడు. పాండవులు మాయజూదమున రాజ్యశ్రీల నెల్లఁ గౌరవుల కోడిపోయి,యరణ్యముల కేగినప్పు డీకుమారుఁడు మేనమామ లగుబలరామకృష్ణులయింట ద్వారకానగరమున నుండెను. ఈతఁ డచ్చట ధనుర్విద్య సాంగముగ నభ్యసించెను. మేనమామలయింట నున్నప్పు డీతనిచిత్తము బలరామతనూజ యగుశశిరేఖయందుఁ జిక్కియుండెను. ఆబాలికచిత్తముగూడ నీతనియందే చిక్కియుండెను. దానికిఁ దగినట్లచ్చటివా రెల్లరును శశిరేఖ యభిమన్యునిభార్యయే యని పలుకుచుండెడివారు. ఈవాక్యములకు సుభద్ర యపరిమితానందమును బొందుచుండెడిది. శశిరేఖాభిమన్యుల యనురాగమంతకంతకభివృద్ధిఁ బొందుచుండెను. ఇంతలో దీనికొకభంగ మొదవెను.

హస్తినాపురాధీశ్వరుఁడగు దుర్యోధనుఁడు గదాయుద్ధము నేర్చుకొనుటయందు బలరామునకు శిష్యుఁడు. ఆతఁడు చక్రవర్తియై యుండి, మహాసంపదలతోఁ దులఁదూఁగుచుండెను. ఆతఁడు శశిరేఖను దనకుమారుఁ డగులక్ష్మణునకిమ్మనిబల

రామునకు వార్తఁబంపెను. బలరాముఁడు గొప్పసంబంధ మని తలంచి యందులకు సమ్మతించెను. ఇయ్యది కృష్ణునకుఁ గొంచెమయిన నిష్టము లేదు. ఇందులకు సుభద్ర మిగులఁజింతించి యగ్రజుం డగుబలరామునిఁ జేరి "అన్నయ్యా! అభిమన్యుఁడు నీకుఁ బరుఁడు కాఁడు, మేనల్లుఁడు. నీవు సంపదకాసింపవలదు. విధికృతమునఁ బాండవులు సంపదలకు దూరస్థులై యరణ్యమున నుండిరి. ఇంతవఱకును నేను నీతో వియ్య మందుదు నని సంతోషించుచుంటిని. నాయానందమునకు భంగము గలిగింపవలదు" అని బ్రతిమాలి చెప్పెను. కాని ప్రయోజనము లేకపోయెను. అట్టిపూస వదలుకొను మని బలరాముఁడు సుభద్రకు గట్టిగాఁ జెప్పెను. చెప్పుటయే కాక పెండ్లికిఁ దరలిరమ్మని దుర్యోధనున కాతఁడు వార్తగూడ బంపెను.

సుభద్రయందులకై దుఃఖనీరధిని మునింగెను. అభిమన్యుఁ డామెవిచారము నెఱింగి "తల్లీ! నీవు దీనికై విచారించెద వేల? మనల నిట్లు పరాభవించినవీరిగృహముననుండ నేల? యని పలికి, తల్లిని వెంటఁ బెట్టుకొని, యెవ్వరికిఁ జెప్పకుండ నరణ్యమునకుఁ బోయెను. ఇల్లుపోయి, భీమునకు హిడింబయందుజనించిన ఘటోత్కచుని యాశ్రమముబ్రవేశించెను. ఈసందర్భమునుబట్టి ఘటోత్కచుఁడునుసభిమన్యుఁడు నన్నదమ్ములగుదురు. ఇరువురును నొకరి నొకరు దెలిసికొనలేక పోవుటచే నయ్యరణ్యమునఁ గలహించి, తుదకు నారదునిచేఁ వారింపఁబడి, తమతమవృత్తాంతముల నెఱింగికొనిరి. మాతృసమేతుఁడై యభిమన్యుఁడు వనంబునకు వచ్చినకారణము ఘటోత్కచునిం

డెత్తింగి "తమ్ముఁడా! నీవు ధైర్యమువహించి నాయాశ్రమ మున నుండుము. నేను ద్వారక కరిగి వివాహచిత్రములు చూచి వచ్చెదను. బలరాముఁడు తనతనూజను దుర్యోధ నాత్మజుఁ డగులక్ష్మణున కెట్లిచ్చునో చూచెద" నని పలికి సుభద్రాభిమన్యులను జాగ్రత్తగాఁ జూచుచుండుమని తన తల్లియగు హిడింబకుఁ దెల్పి, యాతఁడు ద్వారక కరిగెను.

దుర్యోధనుడు భీష్మాదివృద్ధులతోడను బంధువులతో డను పెండ్లికై ద్వారకకు వచ్చెను. ఘటోత్కచుఁడు మాయా బలమున శశిరేఖ యున్నసౌధమును బ్రవేశించి, నిద్రించు చున్న యక్కన్నియను దెచ్చి దనయాశ్రమమున సుభద్రాభి మన్యులకడఁ జేర్చి, తాను మరలవచ్చి, శశిరేఖాకృతితోఁదల్ప మునఁ బండియుండెను. వివాహలగ్నము సమీపించెను. చెలి కత్తెలు వచ్చి కైతనశశిరేఖను దోడ్కొనిపోయి పీటపై గూర్చుండబెట్టిరి. పెండ్లికొమరునకు శశిరేఖముఖముఁ జూచిన యంతనే శరీరము కంప మెత్తెను. పెండ్లికూఁతురిఁ జూచి భూత మని వెఱ్ఱికేకలు వేయసాగెను. ఎంతమంది ధైర్యము చెప్పినను వినక చివరకుఁ బెండ్లికొడుకు పీటమీదనుండి లేచి పరుగెత్తెను. ఇంతలో మాయాశశిరేఖ మాయమయ్యెను. పెండ్లికివచ్చిన వారినెత్తిపై శిలావర్షము గురియఁ బ్రారంభించెను. ఇంత యేల ద్వారకానగర మెట్లుండవలయునో యట్లుండెను. ఈ

మాయకుఁ గారణ మెవ్వరికిఁ దెలియక రాళ్ళవాన కాఁగక జనులు వీధులవెంటఁ బరుగులెత్తుచుండిరి. ఘటోత్కచుఁడు మింటి కెగసి "ఓయీ! బలరామా! మేనల్లుని విడిచి నీతమూజను దుర్యోధనసుతుండగు లక్ష్మణున కొసంగఁ దలంచితివి కదా! కానిమ్ము, తత్ఫలం బనుభవించెదవు" అని పలుకుచు సుయోధనాదులను ద్వారకయందు నిలువకుండఁ దఱిమెను. శ్రీకృష్ణునకు మాత్రి మీమాయ తెలియును. అప్పుడు బలరామున కేమియు నుపాయముదోచక వాసుదేవునికడ కరిగి యిదియంతయు నేమని యడిగెను. కృష్ణుఁ డగ్రజునిఁ జూచి "ఇదియంతయు ఘటోత్కచుఁడు సేయుచున్నమాయ. అభిమన్యుఁడు మాతృసహితుఁడై ఘటోత్కచుని యాశ్రమమును జేరెను. ఘటోత్కచుఁ డభిమన్యుని వృత్తాంత మెఱింగి, మన శశిరేఖను మాయాబలమునఁ దనయాశ్రమమునకుఁ జేర్చి తాను శశిరేఖరూపమున మరల నిటకుఁ జేరి, యీమాయ యంతయుఁ జేయుచున్నాఁడు. కావున వేఱొకయాలోచనము నీమనంబునఁ జేర్పక శశిరేఖ నభిమన్యున కిచ్చెదనని యాతనికిఁ దెలుపు"మని చెప్పెను. బలరాముఁడు కృష్ణుఁడు చెప్పినట్లు మింట నిలిచియున్న ఘటోత్కచునకుఁ దెలిపెను. అంతట ఘటోత్కచుఁడు తన యాశ్రమమునకుఁ బోయి శశిరేఖాసుభద్రాభిమన్యులను ద్వారకకుఁ దోడ్కొని వచ్చెను. బలరాముఁ

డు శశిరేఖ నభిమన్యున కిచ్చి వివాహము గావించెను. అభిమన్యుఁడు శశిరేఖనేకాక మత్స్యనగరాధీశ్వరుఁడైన విరటుని కూఁతురగు నుత్తరనుగూడ వివాహ మాడెను.

—♦ పద్మవ్యూహము ♦—

పాండవులు కౌరవులతోఁ జేసిన శపథము ననుసరించి పండ్రెండేండ్లువనవాసమును నొక్కయేడజ్ఞాతవాసమును సలిపి వచ్చి, తమయర్ధరాజ్యముఁ దమ కిమ్మని కౌరవుల నడుగుటకుఁ గృష్ణుని రాయబారిగాఁ బంపిరి. కౌరవులు పాండవులకు రాజ్యభాగ మొసంగుటకు సమ్మతింపక పోవుటచేయుద్ధము కలిగినది. ఈయుద్ధములో భీష్ముఁడు పదిదినములు పోరి మరణించినపిదప సేనాపతిగా నభిషిక్తుఁ డగు ద్రోణాచార్యుఁడు "అర్జునుఁడు సమీపమున లేకున్నచో ధర్మరాజును బట్టుకొని వచ్చి నీముందుఁ బెట్టుదు" నని దుర్యోధనునకు వరంబిచ్చెను. అందులకై దుర్యోధనుఁడు సుశర్మ మొదలగు రాజులను బురికొల్పి, యర్జునుని యుద్ధమునకు దూరముగాఁ గొనిపోవునట్లు చేసెను. అప్పుడు ద్రోణాచార్యుఁడు యుధిష్ఠిరునిఁ బట్టుకొనుటకుఁబద్మవ్యూహమును బన్నెను.

ధర్మరాజు పరాక్రమవంతుఁడును, ధైర్యచిత్తుఁడునై యున్నను ద్రోణుఁడు పన్నినపద్మవ్యూహమునకు భయమంది శిబిరమున డాఁగియుండెను. ఈమాట ద్రుపదకిఁ దెలిసినచో

నవ్వునేమో యని యాతఁడు మౌనము దాల్చి యుండెను. కాని నెమ్మదిగా ద్రౌపది యాతని భయకారణం బెఱింగి "మహారాజా! కర్తవ్య మూహింపక చింతించుచున్నందువలన బ్రయోజన మేమియున్నది? మనయభిమన్యుకుమారుఁ డద్వితీ యపరాక్రముఁడు. ద్రోణుని వ్యూహమును భేదింపఁగలడు. ఇక్కార్యమునకాతనిని నియోగించిన బాగుగానుండు"నని చెప్పెను.

ఈసంగతి జ్ఞప్తికిఁ దెచ్చినందులకు ధర్మజుఁడు సంతో షించెనుగాని, యభిమన్యునకు మొగ్గరంబునఁ బ్రవేశించుటయే తెలియునుగాని మరల నీవలకు వచ్చువిధము తెలియ దను విషయమునుగూర్చి సంశయించెను. ఇదియుంగాక యర్జునుఁడు సుశర్మాదులపైకి యుద్ధమునకుఁ బోవునప్పుడు కుమారుని నెక్కడకును బంపవలదని కూడ చెప్పియుండెను. తుదకు మఱియొకమార్గ మేమియుఁ దోచకపోవుటచేత నభిమన్యునే పద్మవ్యూహభేదనంబునకు నియోగింప నిశ్చయించి, భీమాదు లకీ వృత్తాంతం బెఱింగించెను వారుగూడ నందులకు సమ్మ తించిరి. అప్పుడభిమన్యుఁడు శల్యునితో గదాయుద్ధము సేయు చుండెను. ధర్మజునియాజ్ఞ ననుసరించి సహదేవుఁ డాకుమారుని దోడ్కొని వచ్చెను.

అభిమన్యుఁడు పరాక్రమవంతుఁ డగుటయే కాక, పెద్దల యందు భక్తి, వినయము, ఆశ్రితావనము మొదలగు సద్గు

ణము లన్నియు నాతని యందు మూర్తీభవించియుండెను. అభిమన్యుఁడు ధర్మజునకు నమస్కరించి తన్నుఁ బిలువబంచిన కారణ మెఱిఁగింపఁగోరెను. అభిమన్యునకు ధర్మనందనుఁడు నెమ్మదిగా నిట్లు పలికెను. "వత్సా! సౌభద్రా! నీవు బాలుఁడ వయ్యును యుద్ధమున నిరుపమానశౌర్యముతో విహరించు చుండుటఁ గని మే మెంతయు సంతసించుచున్నాము. నీవు నేఁడు నాయాజ్ఞఁ దప్పక పాలింతు వని శల్యునితోఁ బోరాట ము మానిపించి నిన్ను రావించితిని. నేఁడు నీవు నన్ను రక్షింప వలయును. త్రిగర్తులతో యుద్ధము సేయుటకు నీతండ్రి యరిగె నని విని గురుఁడు నన్నుఁ బట్టుటకుఁ బద్మవ్యూహమును బన్నినాఁడు. ఆతఁడు చేసినప్రతిన విడుచువాఁడు కాఁడు. గురుఁడు నేఁడు మిగులఁదర్పించియున్నాఁడు. పద్మవ్యూహమును మేమెవ్వరమును భేదింపఁజాలము. కృష్ణార్జునులు సమీపమున లేకపోయి నచో ధర్మజుని బంధించెద నని ద్రోణుఁడు చేసిన ప్రతిజ్ఞకు నీవు భంగ మొనర్చి దుర్యోధనుని కోరికరిత్త సేయువలయును."

భీముఁ డిట్లనెను—"కుమారా! పద్మవ్యూహమును భేదించి మీపెదతండ్రిని రక్షింపఁదగిన సమర్థుఁడవు నీవే కాని మఱియెవ్వరును లేరు. నేనుగదాదండమును బూని రణభూమిఁ బ్రవేశించి శత్రువులశిరములు బ్రద్దలుకొట్టుటయే కాని యె వ్వుడును నిట్టివ్యూహములఁ బన్నుటగాని విప్పుటగాని యెఱుం

గను ఏవిధముననైన నీ వామొగ్గరమును జించి కొంచెము
దారిఁ జూపించితివేని, మే మందుఁ బ్రవేశించి, రిపులను మర్దిం
చెదము. శాత్రవుల వధించుభారము నేను బూనుదును.

నకులుం డిట్లు వక్కాణించెను. "నాయనా! సౌభద్రా,
ఇట్టివ్యూహములనుగూర్చి మే మెఱుంగ మని చెప్పుటకు
మిగుల సిగ్గుగ నున్నది. ఇట్టివ్యూహములవిషయము మాకుఁ
దెలియ దనియు, నర్జునుఁ డియ్యెడల లేఁ డనియుఁ దలంచియే
ద్రోణుఁ డీవ్యూహమును బన్నినాఁడు. కావున నీ వావ్యూహ
మును భేదించి కుంతికంటెను, గోడ లగుసుభద్రయే వీరమాత
యనిపింపుము. ఇదియుంగాక నీయెడల మఱియొకవిశేషమున్న
ది. మాకంటె నిన్నుఁ ద్రోణుఁడు ప్రేమతోఁ జూచును. యు
ద్ధమున నాతఁడు నీపైఁ దీవ్రశరప్రయోగము సేయుఁడు."

సహదేవుం డిట్లు చెప్పెను "కుమారా! వ్యూహమును
భేదించి మాకీర్తి నిలఁబెట్టుము. నీ కావంతయుఁ భయము
గలుగకుండ మే మందఱము నీవెంటనుండిరక్షించుచుందుము.
ఇంతలో నర్జునుఁడు వచ్చును. పెదతండ్రియగుధర్మజునియందు
భక్తిచేతఁగాని, ద్రోణునిప్రజ్ఞకు భంగ మొనర్పవలయు నను
తలంపుచేతఁగాని నీవీకార్యముచేసి మమ్ముఁగాపాడవలయును."

వా రందఱు నీ విధంబునఁ జెప్పినపలుకు లాలించి
యాసౌభద్రుఁడు వారిం గాంచి "తండ్రులారా! ఈచిన్న

పనికై నాతో మీరింతగఁ జెప్పవలయునా? అర్జునుని పుత్రుఁ డనై, కృష్ణుని మేనల్లుఁడనై యుండిననేను హస్తంబునఁ గర వాలము ధరించిన దెందులకు ? యుద్ధమునకుఁ గాదా! మీరు నన్నుఁగూర్చి సంశయింపవలదు. ఆఁకలి గొన్నమృగేంద్రము కురంగపంక్తిపైఁ బడువిధమున నే నాకౌరవసేనపైఁ బడి పద్మ వ్యూహమును భేదించెదను. ద్రోణుని ప్రతిజ్ఞంగూర్చి మీరు భయమొందవలదు. ఆతఁడు మనల నేమియు చేయఁజాలఁడు. ఇఁక నాకు మీ రేమియుఁ జెప్పవక్కరలేదు. పద్మవ్యూ హాభేదనంబునకు నాచిత్తము తత్తరపడుచున్నది." అని పలి కెను. అనంతర మభిమన్యుని యాజ్ఞ ననుసరించి సూతుఁడు సమస్తాయుధోపేత మగు రథమును దెచ్చెను. అంత నభిమ న్యుఁడు యుధిష్ఠిరుని యుద్ధమునకుఁ బోవుట కనుజ్ఞ నిమ్మని కోరెను. ధర్మరాజు కుమారునిఁ గౌఁగిలించుకొని "కుమారా! నీతండ్రి యగు నర్జునుఁడును, మామ యగుకృష్ణుఁడును నిచ్చట లేరు. నిన్నిప్పుడు ద్రోణునిపైకిఁ బంపుచుంటిమి. ద్రోణుఁడు సామాన్యుఁడు గాఁడు. నీవు సుభద్ర కేకపుత్రుఁడవు. నీభార్య గర్భవతి. జాగ్రత్తగా మెలఁగుము. నీకు శుభంబగుఁగాక. పోయి రమ్ము" అని పలికెను. అభిమన్యుఁడు రథం బెక్కి యరిగెను.

అభిమన్యుఁ డరిగినవెంటనే ధర్మరాజు సోదరులఁగాంచి "మనయాజ్ఞ ననుసరించి యభిమన్యుఁడు పద్మవ్యూహమును బ్రవేశింపఁబోయినాఁడు. పరాక్రమశౌర్యమూర్తు లగుమీరు కూడ నాతని వెంట నరిగి, యాతఁడు మొగ్గరముచు జించిన

వెంటనే, మీరును నందుఁ బ్రవేశించి, వైరివీరులఁ గూర్చి, కుమారున కావంతయు నపాయము పొడమకుండఁ గాపాడి, మరల సుభద్రకప్పగించి మాటఁ దక్కింపుఁడు" అని పలికెను. భీమనకులసహదేవులు గూడ నభిమన్యునకు సాహాయ్యము సేయుటకుఁ జనిరి.

అట్లు ధర్మజునిచే ననుజ్ఞాతుఁడై యభిమన్యుకుమారవీరకంఠీరవము రణభూమిం బ్రవేశించి రథసారథిం గాంచి "రథమును ద్వరగాఁ బోనిమ్ము. నేఁటిసంగరమున మహాపరాక్రమముతోఁ జరింపవలయును. దూసినపిచ్చుకత్తిని శత్రుసంహారము పూర్తిగ నగువఱకును, మరల నొరలోఁ బెట్టక నాపరాక్రమశౌర్యంబులు తోడిరాజకుమారుల కాదర్శములుగఁ జేసి, సకలదిక్కులయశోడిండిమము మ్రోఁగించెదఁగాక" అనిపలుకుచుఁ గురుబలంబులఁ దాఁకి నిజబలంబులఁ గాంచి, "పాండవయోధులారా, ధనురాచార్యుఁడు ధర్మనందనుని బంధించుటకై పద్మవ్యూహముఁ బన్నెనని మీరు భయమందఁ బనిలేదు. నే నీపద్మవ్యూహమును భేదించుభారముఁ బూనివచ్చితిని. ద్రోణుఁడు కాఁడు, స్థాణుఁడు వచ్చి నిలిచినను వెనుకంజ వేయను. మీరును ధైర్యచిత్తులై నిలచి, శత్రువులఁ దునుమాడుఁడు. జయాపజయములు దైవాధీనములు. విజయమొందరను మనము గొంటిమేని యశము కలుగును. లేదేని వీరస్వర్గభాగ్యము లభించును." అని నడిపి వీరవిక్రమక్రీడకుఁ బ్రారంభించెను. ఆహా! ఆయభిమన్యుని పరాక్రమము! శౌర్యము

ఆ యస్త్రసంధాన చాతుర్యము! చూపఱ కత్యాశ్చర్యము గలిగించుచుండెను. ఒక్కవీరునికైన నాతనియెదుట నిలిచి యుద్ధము సేయుటకు ధైర్యము చాలకయుండెను. సౌభద్రుని వీర విహారము చూచుటకు దేవతలుగూడ విమానచరులై యంతరిక్షమున నిలిచిరి. అభిమన్యుఁడు కర్ణునిదాఁకి "కర్ణా! దుర్యోధనుఁడు నిన్ను రథచోదకవృత్తియందు నియమించుటకు మాఱుగా, నంగరాజుగఁ జేసి, భాగ్యసమన్వితునిగాఁ జేయుటం జేసి, మిగుల గర్వించియున్నావు. నీవు మహాస్త్రవిద్యాధురంధరుఁడవఁట. మాతండ్రిని జయింపఁగల సమర్థుఁడ వీవేయని కురురాజు నమ్మియున్నాఁడఁట. ఏదీ! నీపరాక్రమ మొక్కింత చూపు" మని వచించెను. కర్ణునకును నభిమన్యునకును ఘోర యుద్ధము జరిగినది. వీ రిరువురును నతిభయంకరముగఁ బోరిరి. తన ప్రియశిష్యునిసుతుండగు నభిమన్యుని పరాక్రమశౌర్యమునకు ద్రోణాచార్యుఁడు మనంబున సంతసించుచుండెను. అభిమన్యుని సాహసచర్యలు చూచి "ఔరా! బాలుఁడైన యభిమన్యుఁ డస్త్రసంధానచాతుర్యమునందుఁ దండ్రిని మించియున్నాఁడే. కర్ణునిఁ జంపుదు నని ధనంజయుఁడు చేసిన ప్రతిజ్ఞ నిక్కుమారుఁడే తీర్చునట్లున్న" దని పాండవయోధు లొకరితో నొకరు ముచ్చటించుకొనసాగిరి. కర్ణుఁడు తన శక్తినంతయు వినియోగపఱచి, సౌభద్రునితోఁ బోరి తుదకు నిలువఁజాలక పరువెత్తెను. ఇట్లే దుర్యోధన దుశ్శాసన శకునిశల్యులుగూడ నభిమన్యుని దాఁకి ఘోరముగఁ బోరి నిలువలేకపోయిరి. కురు

బలములు వెన్ను చూపఁ దొడంగెను. అప్పుడు ద్రోణాచార్యుఁడు పరుగిడుచున్న వీరులఁ జూచి "ఓహో! కౌరవయోధులారా! ఒక్క బాలునితో మీరు సమరము సేయఁ జాలక యీ తెఱంగునఁ బరుగిడుచున్నచో లోకము మిమ్ము గేలిసేయదా? అభిమన్యుఁడు వ్యూహమును భేదింపఁ జూచుచున్నాఁడు. మీ రందఱును విచ్చి పాఱిపోనచో నాప్రతిజ్ఞ సెల్లుట యెట్లు? కురునాథునకు మోదము గలుగుట యెట్లు? ఈతనికి మీ రావంతయు భయము నందవలదు." అని పలికెను. కురుబలములు మరల ముందునకువచ్చి పాండవబలములఁ గవిసెను. ద్రోణుఁడు కాలానలతుల్యమైనశిఖంబుల శత్రువులపైకి గప్పఁ దొడంగెను. అంతట నభిమన్యుఁడు కురువీరుల నందఱ నొప్పించి యెదురులేని పరాక్రమమున వచ్చి ద్రోణున కెదురై "తాతా! నీవు మాతండ్రుల కస్త్రగురుండవు. అట్టి నీవు శిష్యవాత్సల్యమును నావలకుఁ దోఁచిపుచ్చి నేఁడు ధర్మసుతుని బంధించెదనని పద్మవ్యూహమును బన్నితివిగా! కానిమ్ము. మీ మొగ్గరమే మగునో చూచెద" నని పలికి యాతని మార్కొనెను. అభిమన్యుని శౌర్యమునకు ద్రోణుఁడే వెఱగంది, కొంతవఱకుఁ జూచుచు నిలిచి యుండెను. ఊరకొన్నకొలఁది నభిమన్యునిచేఁ బ్రయోగింపఁ బడుచున్న శరములవలన వెలువడుచున్న తీవ్రశరాగ్నిజ్వాలలు కురుసైన్యమును దహించి వేయుచుండెను. అంతట ద్రోణాచార్యుఁడు శిష్యవాత్సల్యము

ను వ్యూదయమునుండి పాఱఁద్రోలి, యభిమన్యునిపై ఘోరా స్త్రములఁ బ్రయోగింప నారంభించెను. ద్రోణునిచేఁ బ్రయో గింపఁబడుచున్న ప్రతియస్త్రము సౌభద్రునిచే ఖండింపఁబడుచుం డెను. ఎట్టకేలకు సౌభద్రుఁడు వ్యూహమును బేదించుకొని లోపలఁ బ్రవేశించి, యెక్కడఁ జూచిన నక్కడఁ దానయై వైరిసేనామధ్యమున వీరవిహారము సేయుచుండెను. ఎవ్వరును నాతని సమీపింప శక్తులు గాకయుండిరి. తనశరమున కెదురు లేకుండ నద్వితీయపరాక్రమమునఁ జరించుచున్న యభిమన్యుని గాంచి, దుర్యోధనుఁడు భయం బంది, నెమ్మదిగా ద్రోణునిఁ జేరి "ఆచార్యా! మన మీతెఱఁగున జూచుచు నూరక యు న్నచో మనకురుసైన్య మంతయు నీదినముననే కాలునిప్రోలు సేరును. అభిమన్యునియెదుట మే మెవ్వరమును నిలువఁజాలక యున్నాము. నిన్నుఁగూడఁ గడచి వ్యూహమును బేదించుకొని లోపలఁ బ్రవేశించినాఁ" డని పలికెను.

ఆచార్యుఁడు దుర్యోధనునిఁ జూచి "కౌరవేంద్రా! నేనును నాతనివీరవిక్రమవిహారమున కద్భుత మందుచున్నాఁడ. శరసంధానమం దీతఁ డర్జునుని మించినాఁడు. ఈతనిచేత బాణ మున్నంతవఱకు మన మెవ్వరమును గెలువఁజాలము. కావున నొకఁడు సారథిని జంపవలయును. మఱియొకఁడు హయములఁ జంపవలయును. ఇంకొకఁడు రథము నుగ్గు సేయవలయును. వేఱొకఁడు వానిచేత నున్నచాపము ద్రుంపవలయును. ఇట్లు చేసి యందఱము నేకమై యాతనిం దాఁకి వధింపవలయును.

ఇంతకంటె వేఱొకమార్గ మేమియు లే దని నుడివెను. ద్రోణాచార్యుఁడు చెప్పినచందమున, దుర్యోధనకర్ణాదివీరు లందఱును గలసి తన్నుఁ దాఁకినను నక్కుమారుఁ డొక్కింతయు నధైర్యము వహింపక యందరతో నన్నివిధములఁ బోరాడుచుండెను. మొగ్గరంబున నభిమన్యుఁ డిట్లుండెను. మొగ్గరమున కావల నున్న భీమాదులు లోపలికిఁ బ్రవేశింపఁ దలంచుచుండఁ గడురయమున సైంధవుఁడు వచ్చి, వారిని నిలువబెట్టి పోరఁ దొడంగెను. ఆకారణమున నభిమన్యునకు భీమాదులు సాహాయ్యము సేయలేకపోయిరి. భీమాదిమహాయోధులనొక్క సైంధవుఁడు వారించుటకుఁ గారణము కలదు. పూర్వము పాండవులు ద్వైతవనమున నుండఁగా సైంధవుం డరిగి ద్రౌపదివిషయమై యెగ్గు దలంచి వారిచే, బరాభవింపఁబడెను. ఆకారణమున నాతఁడు తప మొనర్చి శివునిఁ బ్రసన్నునిగాఁ జేసికొని యొకనాఁటియుద్ధమున నర్జును నిఁదప్పఁ దక్కినపాండవుల శౌర్యము వారింపఁగలసామర్థ్యము వరముగాఁ గ్రహించెను. ఇప్పుడది యాతని కక్కఱకు వచ్చెను.

వీరు లందఱును గలసి యభిమన్యుని విగతరథునిగాఁ జేసిరి. మొగ్గరమునఁ దనవా రెవ్వరును లేకుండ నాతఁ డొంటిగాఁ జిక్కెను. రథము పోయిన వేఱొకరథమును, విల్లు పోయిన వేఱొకవిల్లును నిచ్చువా రెవ్వరును లేకపోయిరి. సైంధవు

డడ్డపడక పోయినచో భీమాదులాతనికి సాహాయ్యము చేసియే యుందురు. కాని యట్టిది యొకవలేదు. అభిమన్యుఁడు తా నింక మరణించుట సత్య మని తలంచి, యధైర్యము నుమాత్ర ము పొందక, గదామాత్రసహాయుఁడై యుద్ధమునకుఁ గడం గెను. దుర్యోధనసుతుఁడగు లక్ష్మణుఁ డభిమన్యుని దాఁకి హ తుం డయ్యెను. తరువాత దుశ్శాసనసుతుఁడు సౌభద్రునితో గదాయుద్ధమునకుఁ గడంగి ఘోరముగఁ బోరెను. అయ్యవస రమున నొకరిగదాప్రహారము లొకరికిఁ దాఁకి యిరువురును విగతజీవు లయిరి. అభిమన్యునిమృతికిఁ గౌరవసైన్యములు సం తోషధ్వనిఁ గావించెను. పాండవబలంబులలో నాహాకారము లుప్పతిల్లెను.

ఆ బాలవీరశిఖామణి, యాసమరసాహితీసంపన్నుఁడగు నభిమన్యుఁడు రణమునఁ బెక్కండ్రి యోధుల నుక్కడఁగించి, మడిసినచోఁ దక్కనవీరులమాట, నావల చూచుకొంద మను నట్లు కురువీరులకు భయము గలిగించి, తుదకు వీరస్వర్గము పొందినాఁడు.

ఆహా! అభిమన్యూ! వీరకుమారశేఖరా! నీయసదృశ పరాక్రమశౌర్యములచేతనీజన్మముధన్యమైనది. నీతల్లిదండ్రులు కృతార్థులైరి. మాభరతవంశమున కెల్లఁ గీర్తిఁ దెచ్చితివి. నీపవి త్రనామము భారతీయులు నిరంతరము స్మరించునట్లు చేసితివి.

5 వృషకేతుఁడు.

వృషకేతుఁడు కర్ణునికొడుకు. భారతయుద్ధానంతరమునఁ బాండవులు కర్ణుఁడు తమ కగ్రజుఁడని తెలిసికొని మిగుల దుఃఖించి, యాతనికుమారుఁ డగు నీతనిఁ దమయొద్ద నుంచుకొనిరి. వృషకేతుఁడు పాండవులయందు మిగుల భక్తి గలిగి సేవించుచుండెను. ఈతఁడునిరుపమానశస్త్రాస్త్రసంవేది. తండ్రియగు కర్ణునితో సమానుఁడు. ధర్మరాజశ్వమేధయాగము సేయ సమకట్టి యజ్ఞాశ్వమును విడిచినప్పుడు దాని కంగరక్షకుఁడుగా భీమాదులతో నీవీరకుమారశేఖరుఁడుగూడ నరిగెను. అట్టిసమయమున భద్రావతీపురాధీశ్వరుఁడగు యౌవనాశ్వధరణీపాలునితో నీతనికిఁ బోరాటము గలిగెను. యౌవనాశ్వునిక్రతువాజిని భీముఁడును, ఘటోత్కచునిసుతుండగు మేఘవర్ణుఁడును హరించుకొని పోయిరి. తత్కారణంబున యౌవనాశ్వుఁడు వారితో యుద్ధము సేయుటకు వచ్చెను. ఆతని నెదిరించుటకు వృషకేతుఁడు నిలిచియుండెను. యౌవనాశ్వుఁడు రణభూమిం బ్రవేశించి వృషకేతుం గాంచి, యాతని పరాక్రమధైర్యాది గుణములకును, దేశమునకును నద్భుతమంది "ఓయీ! బాలకా! నీకులగోత్రనామములు ముందుగా నెఱుంగనిదే కయ్యము సేయరాదు. కావున వచింపు" మనెను. అందులకు వృషకేతుఁడు "రాజేంద్రా! కశ్యపుఁడు వంశకర్త. సూర్య

సుతుండునుఁ ద్రైలోక్యవినుతప్రదాతయునగు కర్ణుఁడు నాకుఁ దండ్రి. నన్ను వృషకేతుఁ డందురు. ధర్మసూనునియశ్వమేధమునకై భవదీయమఖవాజిఁ బట్టితి" మని పలికెను. అంతకు ముందే యౌవనాశ్వునిసేనతో నక్కుమారుఁడు సంగర మాచరించియుండుటచే యౌవనాశ్వుఁ డాతనిగాంచి "వత్సా! నీ శౌర్యమునకుఁ గడు మెచ్చితిని. సంగర మొనర్చి మిగుల నలసియుంటివి. ఇంచుక విశ్రమించి యలసటఁ బాపుకొనుము. అదియుంగాక నీవు పదాతివి. నేను రథికుఁడ. అట్టిచో నీతో నధర్మయుద్ధము సేయుటకు నాచిత్తము సమ్మతింపదు. కావున రథము నిచ్చెద గైకొను" మని వచించెను. అందులకు వృషకేతుఁడు "యౌవనాశ్వధరణీపాలా! నీవు నాయందుఁ గృపాంతరంగుడవై రథము నిచ్చెదనని పలికితివి. అందులకు సంతసించితినిగాని, యయ్యది గైకొనుటకు మాత్రము నాచిత్తము సమ్మతింపదు. ఇంద్రునంతటివాని నర్థిగాఁ జేసినకర్ణునిపుత్రుఁ డనైననేను నీవిచ్చురథమును గైకొంటినేని మైత్రియే ఘటిల్లునుగాని సమర మగునా ? కావున నందులకు సమ్మతింపఁ జాల. నేను పదాతి నని నీ వావంతయు సంశయింపఁ బనిలేదు. బాలుఁడ నని తలంపవలదు, శౌర్యసాహసములకు బాలుఁ డైననేమి? నీకు సాహాయ్యము సేయఁదలచి నీబంధుజనులును బుత్రపౌత్త్రాదులును, రథారూఢులై యరుదెంచి సంగ

రంబునకుఁ గాలు ద్రిప్పుచున్నారు. నే నేకాకి నని నీవు తలంప వలదు. ముకుందుని కృపయే నా కక్షయబలంబని నమ్ముము." అని వచించెను.

యౌవనాశ్వునకును నీతనికిని భయంకరమైన యుద్ధము జరిగెను. అందు యౌవనాశ్వుఁడు వృషకేతుని శరప్రహారమున నేలఁగూల వృషకేతుఁడు వానియెడల జాలి వహించి భగవంతుం డగు వాసుదేవునిఁ దలంచి యాతని బునర్జీవితునిఁ జేసెను. అప్పుడు యౌవనాశ్వుఁడు వృషకేతుఁ గౌఁగలించుకొని "వత్సా! వృషకేతూ! నీవు నన్నుఁ బ్రోచిన కారుణ్యమూర్తివి. పాండవుల నెఱింగియు మాతో రణమునకు మార్కొని వెఱ్ఱి నైతి. ప్రాణసమానమైన మిత్రునకుఁ బ్రాణములొసంగుటయే మైత్రికి ఫలము. అర్థిజనాభీష్టప్రదాత యైననీజనకుఁ డాలంబునఁ దెగినవారికి నీవలెఁ బ్రాణంబు లొసంగలేదు. నీవాతనికంటె నెక్కువకీర్తి గాంచఁగల్గితివి" యని పలికి పాండవులకుఁ గడుఁ గూర్చు మిత్రుఁ డయ్యెను.

రాజా ప్రెస్, రాజమండ్రి.